# ఆంధ్రజ్యోతి

andhrajyothy.com

బుధవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 43.7। కనిష్ఠం 27.4



## కామారెడ్డి జిల్లా వార్తలు

5

గురువారం 8 మే 2025




అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్

## అధికారులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించాలి

• కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్

కామారెడ్డి టౌన్, మే 7(ఆంధ్రజ్యోతి): అధికారులు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించాలని, అకాల వర్షాల వల్ల ధాన్యం తడిసిపోకుండా టార్పాలిన్‌లను కొనుగోలు కేంద్రాల్లో అందుబాటులో ఉంచాలని కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో పౌర సరఫరాలు, వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, మార్కెటింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించాలని తెలిపారు. జిల్లాలో గత ఏడాది కన్న ఇప్పటి వరకు 134 శాతం ఎక్కువగా కొనుగోలు చేయడం జరిగిందని తెలిపారు. జిల్లాలో 446 కొనుగోలు కేంద్రాల్లో ఇప్పటి వరకు 35,161 రైతుల నుంచి 2,57,449.704 మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందని, ఇందులో దొడ్డు రకం ధాన్యం 1,07,343.600 మెట్రిక్ టన్నులు, సన్న రకం 1,50,106.104 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయడం జరిగిందని తెలిపారు. ఇప్పటి వరకు 597.28 కోట్ల రూపాయలు రైతులకు చెల్లించడం జరిగిందని, 9,410 మంది రైతుల వద్ద నుంచి 86,331.520 మెట్రిక్ టన్నుల వరి ధాన్యంకు 43.17 కోట్ల బోనస్ చెల్లించడం జరిగిందని తెలిపారు. అకాల వర్షాల వల్ల ధాన్యం తడిసిపోకుండా ఉండేందుకు అన్ని కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్‌లు అందుబాటులో ఉంచాలని తెలిపారు. జిల్లాలో అవసరమైన గన్ని సంచులు అందుబాటులో ఉంచడం జరిగిందని తెలిపారు. కొనుగోలు కేంద్రాలకు వస్తున్న ధాన్యంను త్వరగా కొనుగోలు చేసి ఎక్కువ కాంటాలు ఎక్కువ మంది హమాలీలను ఏర్పాటు చేసి కొనుగోలు వేగవంతం చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో ఆర్డీవో వీణ, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ రాజేందర్, డీఎస్‌వో మల్లికార్జున్‌బాబు, జిల్లా సహకార అధికారి రామ్మోహన్, డీఏవో తిరుమల ప్రసాద్, జిల్లా మార్కెటింగ్ అధికారిని రమ్య తదితరులు పాల్గొన్నారు.

### ఉపాధి హామీ పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకం కింద చేపట్టనున్న పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో పలు శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకం కింద గ్రామ పంచాయతీ భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, విద్యార్థినుల స్కూల్ టాయిలెట్స్, సీసీ రోడ్లు, పాంపాండ్స్ తదితర పనులకు రెండు రోజుల్లో ఆయా సంబంధిత అధికారులు మండలాల వారీగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని తెలిపారు. గ్రామ పంచాయతీ, అంగన్‌వాడీ భవన నిర్మాణాలకు అవసరమైన భూములను గుర్తించాలని సూచించారు. ప్రతీ వారం ఆయా అధికారులతో సమావేశం నిర్వహించి సమీక్షించడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చందర్‌నాయక్, డీఆర్‌డీవో పీడీ సురేందర్, డీపీవో మురళి, జిల్లా సంక్షేమాధికారి ప్రమీల, ఇన్‌చార్జ్ డీఈవో అశోక్ తదితరులు పాల్గొన్నారు.





## ఎండలోనే.. ఉపాధి

కామారెడ్డి, మే 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉపాధి హామీ పనులు జోరందుకున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ వేసవిలో రికార్డు స్థాయిలో ఉపాధి పనులకు కూలీలు వెళ్తున్నారు. జిల్లాలో వేసవిలో ఉపాధి పనులు జోరందుకున్నాయి. వ్యవసాయ పనులు లేకపోవడంతో కూలీలు ఉపాధి పనుల వైపు మొగ్గు చూపుతున్నారు. కానీ ఉపాధి పనులు జరిగే చోట కూలీలకు వసతులు మాత్రం కల్పించడం లేదని విమర్శలు వస్తున్నాయి. ఎండలోనే ఉపాధి కూలీలు పని చేయాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. ఇటీవల జిల్లాలో 42 నుంచి 45 డిగ్రీలకు పైగానే ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో ఉపాధి హామీ పనుల వద్ద కూలీలు ఎండబారిన పడకుండా సంబంధిత శాఖాధికారులు తగు జాగ్రత్తలు తీసుకోవడం లేదని ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటికే వడ దెబ్బకు ఓ ఉపాధి కూలీ మృతి చెందగా మరొకరు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. కనీసం పనులు జరిగే చోట నీడ వసతి కల్పించడం కాదు కదా తాగునీటి సౌక్యరాన్ని ఉంచడం లేదని కూలీలు పేర్కొంటున్నారు. ఎండలు ముదురుతున్నందున ఉపాధి పనుల వద్ద టెంట్లు, తాగు నీటి సౌకర్యం, ప్రథమ చికిత్సకు అవసరమగు మందులు అందుబాటులో ఉంచాలని కూలీలు కోరుతున్నారు.

### జిల్లాలో జోరుగా ఉపాధి పనులు

జిల్లాలో సుమారు 2 లక్షల వరకు కూలీలు ఇప్పటి వరకు ఉపాధి పనులు చేపట్టినట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. గత ఏడాది మే చివరి వరకు లక్షా 20వేల మంది కూలీలు ఉపాధి హామీ పనులకు హాజరయ్యారని గతంతో పోలిస్తే ఈ యేడు లక్ష మంది కూలీలు అదనంగా ఉపాధి పనులకు హాజరైనట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఉపాధి హామీ పథకం కింద ఆయా గ్రామాల్లో చెరువుల పూడికతీత, ఫాంపాండ్‌ల నిర్మాణం, పార్క్‌లేషన్ ట్యాంక్‌ల నిర్మాణం, అటవీ ప్రాంతాల్లో కందకాలు తవ్వడం, చేపల చెరువుల తవ్వకాలు తదితర పనులు చేపడుతున్నారు. ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉపాధి పనులు చేపడుతున్నారు. ఉదయం 7 గంటలకే సూర్యుడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. ఇక 10 దాటిందంటే బయట తిరగలేని విధంగా ఎండలు ఉంటున్నాయి. తీవ్ర ఎండలతో ఉపాధి కూలీలు పనులు చేయడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

### ఎండా కాలం నిలువ నీడ లేదు

జిల్లాలో ఎండలు మండిపోతున్నాయి. ఉదయం పూటనే ఉపాధి హామీ పనులకు వెళ్లే వారు పనిచేసే చోట నిలువ నీడలేని పరిస్థితి ఉందని కూలీలు వాపోతున్నారు. పొట్ట కూటి కోసం కూలీ పనికి వెళితే ఎండలకు బేజారు అవుతున్నారు. నిప్పులు కురుస్తున్న బానుడు ఓ వైపు అయితే మరో వైపు పనులు చేసే చోట సౌకర్యాల లేమి. చెమటలు కక్కుతున్న కూలీలు బుక్కెడు నీళ్ల తాగు దామన్నా దొరకని వైనం. దీంతో ఉపాధి హామీ పనులు సంగతి పక్కన పెడితే ఎండలతో రోగాల బారిన పడుతున్నామని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెరసి ఉపాధి హామీ పనులంటేనే కూలీలు జంకుతున్నారు. జిల్లాలో ఉదయం 8 గంటల నుంచి వడగాలులు, పగటిపూట ఉష్ణోగ్రతలు 42 డిగ్రీల వరకు పెరగడంతో ఎండకు భయపడుతునే కూలీలు ఉపాధి హామీ పనులకు వెళుతున్నారు.

- జిల్లాలో జోరుగా ఉపాధి హామీ పనులు
- నిలువ నీడ లేదు.. తాగు నీరు లేదు
- ఉపాధి హామీ కూలీలకు సౌకర్యాలు కరువు
- పని చేసే చోట కూలీలకు వడ దెబ్బ
- జాడలేని టెంట్లు, మెడికల్ కిట్లు
- పాత వాటితోనే నెట్టుకొస్తున్న వైనం
- ఇప్పటికే వడ దెబ్బతో ఒకరు మృతి.. మరొకరికి తీవ్ర అస్వస్థత

కూలీలు హాజరవుతున్నప్పటికీ వారికి పనిచేసే ప్రాంతాల్లో నిలువ నీడలేక గాయాలపాలయితే ప్రమాద చికిత్స కోసం మెడికల్ కిట్లు లేక తాగేందుకు నీరు లేక అవస్థలు పడుతున్నారు. ఉపాధి హామీ పనులు జరిగే చోట సౌకర్యాలు కల్పించి కూలీలను ఆదుకోవాలనే డిమాండ్ వస్తున్నాయి.

### వడ దెబ్బ బారిన పడుతున్న కూలీలు

రోజు రోజుకూ ఎండలు ముదురుతున్నాయి. ఎండలకు జనజీవనం బయటకు వెళ్లలేని పరిస్థితి ఎదురవుతోంది. ప్రతిరోజూ ఎండలో కూలీ పని చేసుకునే కూలీల పరిస్థితి చెప్పనక్కర లేదు. ప్రతీ ఏడాది కూలీలు వడదెబ్బకు గురై అస్వస్థతకు గురి కావడం కొన్ని చోట్ల మృతి చెందిన లాంటి సంఘటనలు గతంలో చోటు చేసుకున్న దాఖలాలు ఉన్నాయి. ఇలాంటి ఘటనలే ప్రతీ యేటా పునరావృతం అవుతున్నాయి. ఈ యేడు కూడా వడ దెబ్బకు గురై ఒకరు ప్రాణాలు వదిలారు. ఉపాధి చట్టం ప్రకారం పని చేసే చోట కూలీలకు అన్ని వసతులు కల్పించాల్సిన అవసరం ఉంది. కూలీలు పని చేస్తున్న చోట నీడ కోసం గుడారాలు, కూలీలకు ప్రమాదవశాత్తు స్వల్ప గాయాలు అయితే ప్రమాద చికిత్స చేయడానికి చికిత్స పెట్టేలు, దాహార్తిని తీర్చేందుకు తాగునీటి వసతి కూడా లేదు. తాగు నీటి కోసం రూ.5 ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారే తప్ప పనిచేసే చోట నీటి సౌకర్యం కల్పించడం లేదని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపంతో కూలీలు ఎండలో, చెట్ల కింద భోజనాలు చేస్తున్నారు.

### జిల్లాలో 1.77 లక్షల జాబ్ కార్డులు

జిల్లా వ్యాప్తంగా 1,77,519 జాబ్ కార్డులు ఉండగా ఈ జాబ్ కార్డులలో 2,90,107 మంది కూలీలు ఉపాధి పనులు చేస్తున్నారు. వీరంతా ఇతర ప్రాంతాలకు వలస పోకుండా ఉండేందుకు స్థానికంగా పని కల్పించేందుకు 2005-06 అప్పటి యూపీఏ ప్రభుత్వ హయాంలో మహాత్మాగాంధి ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకం ద్వారా జాబ్‌కార్డు కలిగిన వారందరికీ ఏడాదికి కనీసం 100 పని దినాలు కల్పించాలని చట్టంలో పేర్కొన్నారు. ఆ మేరకు గ్రామాల్లో సభలు నిర్వహించి పనులను గుర్తించి కూలీలకు పనులు కల్పిస్తున్నారు. అయితే గత రెండు సంవత్సరాల నుంచి కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకంలో పలు ఆంక్షలను విధిస్తుండడంతో కూలీలు పనులకు హాజరుకావడం లేదు. ప్రతీ యేటా గ్రామీణాభివృద్ధిశాఖ జిల్లాకు నిర్దేశించే ఉపాధి హామీ లక్ష్యం కూడా చేరుకోవడం లేదు.

## ఉగ్రవాదులకు ఇండియన్ ఆర్మీ కోలుకోలేని దెబ్బ కొట్టింది

### ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ



భిక్కనూరులో మాట్లాడుతున్న షబ్బీర్‌అలీ

భిక్కనూరు, మే 7(ఆంధ్రజ్యోతి): అమాయక ప్రజల ప్రాణాలను తీస్తున్న పాకిస్థాన్ ఉగ్రవాదులకు ఇండియన్ ఆర్మీ కోలుకోలేని దెబ్బ తీసిందని, ఇండియన్ ఆర్మీకి సెల్యూటని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ అన్నారు. బుధవారం భిక్కనూరులో ప్రభుత్వ సలహాదారుడు మాట్లాడుతూ పహల్గాంలో అమాయకమైన ప్రజల ప్రాణాలు తీసిన పాకిస్థాన్‌తో పాటుగా పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోని తొమ్మిది ఉగ్రవాదుల స్థావరాలపై భారతదేశ భూ భాగం నుంచే భారత బలగాలు దాడి చేసి ధ్వంసం చేయడం వారి ధైర్య సాహసాలకు నిదర్శనమని కొనియాడారు. ఉగ్రవాదుల ఏరివేతకు భారత సైన్యం తీసుకునే ఏ చర్యకైనా యావత్ భారతదేశం మద్దతుగా ఉంటుందన్నారు. పాకిస్థాన్ కవ్వింపు, పిరికిపంద చర్యలకు భారత సైన్యం దీటుగా జవాబు నిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## 22వ ప్యాకేజీ పనులకు రూ.23 కోట్ల మంజూరు

### ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

కామారెడ్డి/సదాశివనగర్, మే 7(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి నియోజకవర్గంలో లక్ష ఎకరాలకు సాగు నీరు అందించడానికి కృషి చేస్తున్నామని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత పాలకుల అసమర్థ పాలన వల్ల గత మూడు సంవత్సరాలుగా ఎటువంటి నిధులు లేక పోవడంతో పనులు నిలిచిపోయాయని తెలిపారు. దీంతో కాళేశ్వరం 22వ ప్యాకేజీ పనులకు నిధులు కేటాయించాలని అసెంబ్లీ సమావేశాల్లో ఈ అంశాన్ని ఎత్తి చూపుతూ ఎల్లారెడ్డి ప్రజల తరఫున అభ్యర్థించినట్లు తెలిపారు. అంతేకాకుండా నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి దృష్టికి సమస్యను తీసుకెళ్లి, చీఫ్ ఇంజనీర్‌తో సమీక్ష సమావేశాలు ఏర్పాటు చేసి పనులు తిరిగి ప్రారంభించేందుకు చర్చలు జరిపామని అన్నారు. దీంతో రూ.23కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసిందని ఈ నిధులతో యాచారం పంప్‌హౌస్, చందాపూర్, తాడ్వాయి లెఫ్ట్ మెయిన్ కెనాల్, దేవాయిపల్లి లెఫ్ట్ మెయిన్ కాలువ, సోమారం లెఫ్ట్ మెయిన్ కాలువ, బ్రహ్మాజీవాడి లెఫ్ట్ మెయిన్ కాలువ, మార్కభూంపల్లి, లింగంపల్లి, ధర్మారావుపేట గ్రామాల్లో కాలువల కోసం సేకరించిన భూములకు రైతులకు పరిహారం చెల్లించనున్నట్లు తెలిపారు. ఈ నిధుల మంజూరుతో ఎల్లారెడ్డి నియోజకవర్గ రైతులు ఒక లక్ష ఎకరాలకు సాగునీరు అందించే దిశగా కృషి చేసినట్లు తెలిపారు.

## రైతులను ఆగం చేస్తున్న.. అకాల వర్షాలు

- పగలు, రాత్రి వేళల్లో జిల్లాను కమ్మేస్తున్న కారు మబ్బులు
- కొన్ని మండలాల్లో ఈదురు గాలులు, వడగండ్లతో కూడిన అకాల వర్షాలు
- అకాల వర్షాలతో తడుస్తున్న ధాన్యం
- చేతికి వచ్చిన పంట ఏమవుతుందోనని రైతుల్లో ఆందోళన

కామారెడ్డి టౌన్, మే 7 (ఆంధ్ర జ్యోతి): జిల్లా రైతులను అకాల వర్షాలు ఆగం చేస్తున్నాయి. గత నాలుగైదు రోజుల నుంచి పగలు, రాత్రి వేళల్లో ఆకాశమంతా కారుమబ్బులు కమ్మేయడంతో రైతుల్లో భయం కనిపిస్తోంది. కేంద్రాల్లోని వరి ధాన్యం, పంట పొలాల్లోని వరిని కాపాడుకునేందుకు రైతులు నానా తంటాలు పడుతున్నారు. హమీల కొరతతో కేంద్రాల వద్ద పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు జరగకపోవడం, మరికొన్ని చోట్ల రైస్‌మిల్లులకు కొన్న ధాన్యాన్ని వెంట వెంటనే తరలించకపోవడంతో అకాల వర్షాలకు ఎక్కడ తడిసిపోతాయోనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కేంద్రాల వద్ద ఉన్న ధాన్యాన్ని వెనువెంటనే కొనుగోలు చేసి తరలించాలంటూ రైతులు డిమాండ్ చేస్తున్నారు. మంగళవారం అర్ధరాత్రి కామారెడ్డి మండలంతో పాటు ఆయా మండలాల్లో ఈదురుగాలులతో కూడిన అకాల వర్షాలు పడడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గాంధీ గంజ్‌లో ఆరా బోసిన ధాన్యం వరద నీటికి కొట్టుకుపోయింది. లింగాపూర్‌లో కొనుగోలు కేంద్రం వద్ద నీరు మడుగులు కట్టడంతో రైతులు తెచ్చిన ధాన్యంలో నీరు చేరింది. దీంతో బుధవారం ఉదయం రైతులు ఆ నీటిని బయటకు పంపేందుకు నానా అవస్థలు పడ్డారు. అదేవిధంగా ఈదురు గాలులతో పలుచోట్ల రేకులషెడ్లు కూలిపోయాయి.

### అర్ధరాత్రి అకాల వర్షం

జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, జుక్కల్ నియోజకవర్గాల్లోని కామారెడ్డి, భిక్కనూరు, రాజంపేట, ఎల్లారెడ్డి, తాడ్వాయి, లింగంపేట, మహ్మద్‌నగర్ మండలాల్లో మంగళవారం అర్ధరాత్రి అకాల వర్షం పడడంతో రైతులు దిక్కుతోచని పరిస్థితిని ఎదుర్కొన్నారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని గాంధీగంజ్, పాత రాజంపేట, అడ్లూర్, రామేశ్వర్‌పల్లి, టెక్రియాల్, లింగాపూర్ ప్రాంతాల్లో అకాల వర్షంతో ధాన్యం తడిసిపోయింది. అర్ధరాత్రి 1.30 ప్రాంతంలో ఈదురు గాలులు, వడ గండ్ల వర్షం పడడంతో నీటికి కొట్టుకుపోతున్న ధాన్యాన్ని చూసి తీవ్ర ఆవేదన చెందారు. దాదాపు రెండు గంటల పాటు ఈదురు గాలులు, వడగండ్ల వానతో చేతికి వచ్చిన పంట ఏమవుతుందోనని కంటి మీద కునుకు లేకుండా ఉండాల్సిన పరిస్థితి ఎదురయిందంటూ రైతులు పేర్కొంటున్నారు. రోజుల వ్యవధిలోనే ధాన్యం కొట్టుకుపోవడంతో ఏం చేయాలో అర్థం కావడం లేదని కొనుగోలు కేంద్రాల వద్ద సరైన సౌకర్యాలు కల్పించకపోవడంతో పాటు వెంట వెంటనే కొనుగోలు చేపట్టడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. హమాలీల కొరత ఉందంటూ అధికారులు చెబుతున్నారని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని తరలించే సమయంలోనూ అలసత్వం ప్రదర్శిస్తున్నారని వాపోతున్నారు.

### ఆకాశాన్ని కమ్మేస్తున్న మబ్బులు

ప్రతీ యాసంగి సీజన్‌లో అకాల, వడ గండ్ల వర్షం కురువడం సాధారణమే. సరిగా కోతల సమయంలోనే కురుస్తుండడంతో ప్రతీఏటా రైతుల ధాన్యం తడిసిపోతుండడంతో తీవ్రంగా నష్టపోతున్నారు. ఇటీవల వాతావరణంలో చోటు చేసుకుంటున్న మార్పులు ఆకాశాన్ని కారుమబ్బులు కమ్మేస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. నాలుగైదు రోజుల నుంచి జిల్లాలో అక్కడక్కడ అకాల వర్షాలు కురుస్తుండడంతో కేంద్రాలు, పంట పొలాల్లోనే ధాన్యం తడిసిపోతోంది. కామారెడ్డి, భిక్కనూర్, దోమకొండ, బీబీపేట, మాచారెడ్డి, రామారెడ్డి తదితర మండలాల్లో కురుసిన అకాల వర్షాలు, వడ గండ్లతో పంటలు దెబ్బ తినడమే కాకుండా కేంద్రాల్లోని ధాన్యం తడిసిపోయింది. వడ గండ్ల వర్షాల తాకిడికి వడ్లు రాలిపోయి నేల పాలవుతున్నాయి.



లింగాపూర్‌లో తడిసిన ధాన్యాన్ని చూపుతున్న రైతులు



..కొనుగోలు కేంద్రం వద్ద నిలిచిన వర్షపు నీరు



లింగారెడ్డిపేట్‌లో తడిసిన ధాన్యాన్ని చూపుతున్న రైతు

## సొంతిల్లు లేని నిరుపేదలకే ఇందిరమ్మ ఇళ్లు

### ప్రభుత్వ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి



బాన్సువాడలో సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న పోచారం

బాన్సువాడ, మే 7 (ఆంధ్రజ్యోతి): సొంత ఇల్లు లేని నిరుపేదలకే ఇందిరమ్మ ఇల్లు అందజేస్తామని ప్రభుత్వ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం బాన్సువాడ పట్టణంలోని తన స్వగృహంలో ఆయన అధ్యక్షతన బాన్సువాడ నియోజకవర్గ ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికకు గ్రామ, వార్డు ఇందిరమ్మ కమిటీ సభ్యులు, అధికారులతో అవగాహన సదస్సును నిర్వహించారు. సొంత ఇల్లు లేని నిరుపేదలకే ఇందిరమ్మ ఇళ్ల అందజేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఇందిరమ్మ ఇంటిని మహిళల పేరు మీదే మంజూరు చేస్తారన్నారు. ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యుల ద్వారా పారదర్శకంగా ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారుల ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. అదేవిధంగా ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో ఎటువంటి రాజకీయాలకు జోక్యం లేకుండా చూడాలన్నారు. జాబితాలో పేరు లేని వారు నిరాశ చెందవద్దని.. రెండవ విడత ఎంపిక జరుగుతుందన్నారు. ఇది నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందన్నారు. ప్రతీ గ్రామంలో అర్హులకే ఇందిరమ్మ ఇళ్ల వచ్చేలా ఇందిరమ్మ కమిటీ సభ్యులు అందరూ కూర్చోని నిర్ణయించాలన్నారు. గ్రామ, వార్డు సభల్లో ఆమోదం పొందిన తరవాతే లబ్ధిదారులను కలెక్టర్ ఎంపిక చేస్తారన్నారు. లబ్ధిదారుల జాబితాను జిల్లా కలెక్టర్, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిని సంప్రదించి ఇంటిని మంజూరు చేస్తామ ని ఆయన తెలిపారు. 400 చదరపు అడుగుల్లో ఇంటి నిర్మాణం చేపట్టాలనీ. కిచెన్, బాత్రూం ప్రత్యేకంగా ఉండాలి. ఆర్‌సీసీ రూఫ్‌తో ఇంటిని నిర్మించాల్సి ఉంటుందన్నారు. బాన్సువాడ నియోజకవర్గం మొత్తానికి 3,514 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాలరాజు, మాజీ డీసీ సీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి, సబ్ కలెక్టర్ కిరణ్మయి, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, బాన్సువాడ నియోజకవర్గంలోని అన్ని మండలాల ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కంపు కొడుతున్న గాంధారి వాగు

- గాంధారి వాగులో ఇష్టారీతిన చెత్తాచెదారం వేస్తున్న వైనం
- పట్టించుకోని గ్రామ పంచాయతీ సిబ్బంది
- తీవ్ర దుర్గంధంతో ప్రయాణికులకు ఇబ్బందులు



7


మాట్లాడుతున్న డీఎస్పీ భిక్షపతిరావు


సమావేశంలో మాట్లాడుతున్న నార్కోటిక్స్ ఏసీపీ శంకర్‌యాదవ్


బోధన్‌లో మాట్లాడుతున్న యాంటీ నార్కోటిక్ బ్యూరో ఏసీపీ సుబ్బారామి రెడ్డి

# కల్తీకల్లు, డ్రగ్స్‌కు బానిసలు కావొద్దు

● యాంటీ నార్కోటిక్స్ డ్రగ్స్ జిల్లా అధికారి భిక్షపతిరావు

మోపాల్, మే 7 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రజలు కల్తీకల్లు, డ్రగ్స్‌కు బానిసలు కావద్దని యాంటీ నార్కోటిక్స్ డ్రగ్స్ జిల్లా అధికారి భిక్షపతిరావు అన్నారు. బుధవారం మండలంలోని మంచిప్ప, న్యాల్‌కల్, ముదక్‌పల్లి, మోపాల్ గ్రామాల్లో ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో యాంటి నార్కొటిక్స్ బ్యూరో ఆధ్వర్యంలో మాదకద్రవ్యాలు, కల్తీకల్లును నిర్మూలించాలని గ్రామాల్లో ర్యాలీ అవగాహన సదస్సులను నిర్వహించారు. ఈ సందర్భంగా యాంటి నార్కోటిక్స్ డ్రగ్స్ జిల్లా అధికారి భిక్షపతిరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్తీకల్లు తాగడం వల్ల అనారోగ్యాల బారిన పడి అనేక మంది ప్రజలు తమ ప్రాణాలు కోల్పోతున్నారని అన్నారు. కల్తీకల్లుకు, డ్రగ్స్‌కు యువత బానిసలవుతున్నారని అన్నారు. కల్తీకల్లు, డ్రగ్స్‌పై ప్రభుత్వం ఉక్కుపాదం మోపిందని అన్నారు. ఎవరైనా ఇటువంటి మాదకద్రవ్యాలు అమ్మినట్లయితే 1980 నెంబర్‌కు సమాచారం అందించాలని కోరారు. మహిళలు, గర్భిణులు కల్తీకల్లు తాగడం వల్ల పుట్టబోయే పిల్లలు అనారోగ్యాలబారిన పడుతున్నారని అన్నారు. ఈత చెట్లనుంచి వచ్చే స్వచ్ఛమైన కల్లును తాగాలని అన్నారు. తమ వ్యాపారం కోసం కొందరు కల్లులో అల్ఫ్రాజోలం కలిపి ప్రజల ప్రాణాలతో ఆడుకుంటున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్‌ఐ మల్లేష్, ముదక్‌పల్లి డాక్టర్ ప్రత్యూష, ఎస్‌ఐ యాదగిరి, ఏఎస్‌ఐ రమేష్ ఆయా గ్రామాల మాజీ ప్రజాప్రతి నిధులు, వీడీసీ సభ్యులు, యువకులు, మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

**నవీపేట:** రాష్ట్రంలో మాదక ద్రవ్యాలు, కల్తీకల్లును నిర్మూలించాల్సిన అవసరం ఎంతైన ఉందని యాంటీ నార్కోటిక్ బ్యూరో ఇన్‌స్పెక్టర్ కరుణ ప్రసాద్ అన్నారు. బుధవారం మండలంలోని నవీపేట, జన్నేపల్లి, ఫకీరాబాద్, ఫత్తేనగర్‌లలో జరిగిన సమావేశాలలో ఆయన మాట్లాడారు. మాదక ద్రవ్యాలు, కల్తీకల్లు నిర్మూలనకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులకు క్రీడ సామగ్రిని అందజేశారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ వినయ్, ఎక్సైజ్ ఎస్‌ఐ గంగాధర్, నవీపేట మెడికల్ ఆఫీసర్ కావ్య, పంచాయతీ కార్యదర్శి రవీందర్ నాయక్, తెడ్డు పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.

**ఇందల్వాయి:** గ్రామీణప్రాంతాల్లో యువత మత్తు పదార్థాలు, గంజాయి, కల్తీకల్లు, డ్రగ్స్ లాంటి మత్తు పదార్థాలకు యువత బానిసై కల్తీకల్లు తాగుతూ విలువైన జీవితాలను నాశనం చేసుకోవద్దని తెలంగాణ మాదక ద్రవ్యాల నిరోధక చట్టం డీఎస్పీ శ్రీధర్ అన్నారు. మండలంలోని ఇందల్వాయి, గన్నారం, నల్లవెల్లి, లోలం తదితర గ్రామాల్లో ప్రజలకు మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రామీణ ప్రాంతంలోని ప్రజలు కల్తీకల్లు తాగితే కాళ్లు చేతులు పడిపోవడం, కంటి చూపు తగ్గడం, ఇతర ఆరోగ్య సమస్యలు తలెత్తి ప్రాణాలుపోయే ప్రమాదం ఉందని కల్తీ కల్లులో ఎక్కువగా డైజోఫామ్, ఆల్ప్రాజాలం లాంటి మత్తు పదార్థాలు వాడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో నార్కోటిక్ డీఎస్పీ శ్రీధర్, సీఐ మల్లేష్,ఎస్సై, ఎక్సైజ్ సిబ్బంది, గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.

**ముప్కాల్:** కల్తీకల్లు, మాదకద్రవ్యాల వినియోగంతో యువత నిర్వీర్యంగా మారుతుందని నార్కోటిక్స్ సీఐ వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం ముప్కాల్ మండల కేంద్రంలోని ర్యాలీ నిర్వహించారు. అనంతరం మార్కెట్ యాడ్‌వద్ద కల్తీకల్లు, మాదకద్రవాయల వినియోగంపై తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ఆధ్వర్యంలో అవగాహన నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో నరేష్ ఆనంద్, వీడీసీ అధ్యక్షుడు సిద్ది రమేష్, లయన్స్ క్లబ్ సభ్యులు రాజేశ్వర్,సెక్రటరీ,సిబ్బంది, అంగన్‌వాడి టీచర్లు పాల్గొన్నారు.

**మోర్తాడ్:** మండల కేంద్రంలోని మోర్తాడ్, దొన్కల్, ధర్మోరా గ్రామాలలో కల్తీకల్లు, కల్తీకల్లు తీసుకునే వినియోగదారుల ఆరోగ్యంపై వాటి ప్రభావం గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. మోర్తాడ్ గ్రామ పంచాయితీలో ఏర్పాటు చేసిన సమావేశంలో తెలంగాణ యాంటీ కార్కోటిక్ బ్యూరో నోడల్ ఏజెన్సీగా పనిచేస్తున్న జీవన్‌రెడ్డి, ఎక్సైజ్ అధికారులు ప్రజలకు కల్తీకల్లు వల్ల కలిగే దుష్పరిమానాలపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్ర మంలో ఎస్సై విక్రం, ఎక్సైజ్ అధికారులు మానస, డాక్టర్ స్పందన, ఐసీడీ ఎస్ అధికారి మంజులా, కార్యదర్శి సైఫుద్దీన్, గ్రామస్థులు పాల్గొన్నారు.

**జక్రాన్‌పల్లి:** యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని నార్కోటిక్స్ ఏసీపీ శంకర్‌యాదవ్ అన్నారు. బుధవారం మండలంలోని జక్రాన్‌పల్లి, సికింద్రాపూర్, తొర్లికొండ, మునిపల్లి గ్రామాలలో గంజాయి, డ్రక్స్, కల్తీకల్లు, మత్తుపదార్థాలపై యువకులకు, గ్రామస్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు.అనంతరం యువతకు, విద్యా ర్థులకు క్రీడాసా మాగ్రిలైన వాలీబాల్, టెన్నికాయిట్స్ , ఇతర క్రీడాసామగ్రిని ఏసీపీ శంకర్ యాదవ్ అందజేశారు. అనంతరం ఈ గ్రామాలలో పోలీసులు, యువకులు, విద్యార్థులు, ప్రజలు ప్రధాన వీధుల గుండా అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సైలు ప్రమోద్ చైతన్య, సందీప్, జక్రాన్‌పల్లి ఎస్సై మాలిక్ రెహమాన్, ఎఎస్సై వెంకట్‌కు మార్, వైద్యాధికారి రవీంధర్,ఏఎన్ఎంలు,ఆరోగ్యసిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

**రెంజల్:** తెలంగాణ యాంటీ నార్కోటిక్ బ్యూరో ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాలు, కల్తీకల్లు నిర్మూలనపై బుధవారం రెంజల్ మండల కేంద్రంతో పాటు సాటాపూర్, నీలా, కందకుర్తి గ్రామాలలో నార్కోటిక్ బ్యూరో సీఐ సామ్యా నాయక్, రెంజల్ ఎస్‌ఐ చంద్రమోహన్ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు తమ విలువైన ప్రాణాలను కాపాడుకునేందుకు మాదక ద్రవ్యాలు, కల్తీకల్లుకు దూరంగా ఉండి తమ ఆరోగ్యాన్ని కాపాడుకుని డ్రగ్స్ రహిత తెలంగాణ కోసం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

**సిరికొండ:** పోలీస్ కమిషనర్ ఆదేశానుసారంగా సిరికొండ మండలంలోని కొండాపూర్, గడ్కోల్, సిరికొండ, పెద్దవాల్గోట్ గ్రామాల్లో బుధవారం నాడు పోలీస్, ఎక్సైజ్ సిబ్బంది ప్రజలతో కలిసి ర్యాలీ నిర్వహించి సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ గ్రామాల్లో నార్కోటిక్ ఏసీపీ దీక్షిత్, సీఐ బిక్షపతి మాట్లాడుతూ కల్తీకల్లు అలవాటు పడితే జీవితం అదోగతి పాలవుతుందని అన్నారు. కార్యక్రమంలో సిరికొండ ఎస్సై ఎల్.రామ్, ఎక్సైజ్ ఎస్సై గోవర్ధన్, సిబ్బంది పాల్గొన్నారు.

**కోటగిరి:** కల్తీకల్లు ఆరోగ్యానికి హానికరమని యాంటీ నార్కోటిక్ బ్యూరో డీఎస్పీ రమేష్ పేర్కొన్నారు. రుద్రూరు మండల కేంద్రంలో గాంధీ చౌక్ వద్ద బుధవారం మాదక ద్రవ్యాలు, కల్తీకల్లుపై ప్రజలకు అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీఎస్పీ రమేష్ మాట్లాడుతూ జిల్లాలో 104గ్రామాలలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. ప్రస్తుతం స్వచ్ఛమైన కల్లు దొరకడం లేదన్నారు. ప్లకార్డులతో పోలీస్ స్టేషన్ నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీ కొనసాగింది. పొతంగల్ మండలంలోని పొతంగల్, హంగర్గ గ్రామాల్లోనూ మాదక ద్రవ్యాలు, కల్తీకల్లు నిర్మూలనపై ర్యాలీ, అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాట్ సీఐ పూర్ణేశ్వర్, ఎక్సైజ్ సీఐ విలాస్ కుమార్, రుద్రూరు సీఐ కృష్ణ, ఎస్‌ఐలు సాయన్న, సునీల్, ఏఎంసీ ఛైర్మన్ హన్మంతు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**ఏర్గట్ల:** యువత మత్తు పదార్థాలకు భానిసై తమ విలువైన జీవితాన్ని పాడుచేసుకోవద్దని టీఎస్‌న్యాబ్ ఎస్సై జీవన్‌రెడ్డి, ఎక్సైజ్ఎస్సై మానస, ఏర్గట్ల ఎస్సైరాము తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో తెలం గాణ యాంటీ నార్కొటిక్స్ బ్యూరో ఆధ్వర్యంలో మండలంలోని యువకులకు కల్తికల్లు తాగడం, మత్తు పదార్థాలు, గంజాయి, డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో మండలంలోని యువకులు పాల్గొన్నారు.

**బోధన్‌రూరల్:** డ్రగ్స్ యువత జీవితాన్ని నాశనం చేస్తుందని, మాదక ద్రవ్యాల జోలికి వెళ్లవద్దని యాంటీ నార్కోటిక్ బ్యూరో ఏసీపీ సుబ్బారామి రెడ్డి, బోధన్ ఏసీపీ శ్రీనివాస్‌లు అన్నారు. బుధవారం బోధన్ పట్టణంలో కల్తీకల్లుపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చౌరస్తా నుంచి కొత్త బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. మండలంలోని సాలూ, పెగడాపల్లి, కల్దుర్కి, రాంపూర్ తదితర గ్రామాలలో తెలంగాణ ఎంఏబీ ఏసీపీ సోమనాథం, రూరల్ సీఐ విజయ్ బాబు, ఎస్‌ఐ మచ్చేందర్ రెడ్డి, శిక్షణ ఎస్‌ఐ రమా, ఎక్సైజ్ ఎస్‌ఐ జలీల్ హైమద్, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

**మోస్రా:** చందూర్, మోస్రా మండల కేంద్రాల్లో ఆబ్కారీ శాఖ నార్కోటిక్ నిరోధక శాఖ ఆధ్వర్యంలో కల్తీకల్లు, గంజాయి వంటి మత్తు పదార్థాలను నిషేధించాలని మండల కేంద్రాల్లోని గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నార్కోటిక్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ కుమార్, ప్రత్యేక అధికారి నీలావతి మాట్లాడుతూ ఇంట్లో పెద్దలు, పిల్లల పట్ల శ్రద్ధ వహించాలి, పాఠశాల, కళాశాల నుండి రాగానే వారు ఏం చేస్తున్నారు గమనిస్తూ క్రమశిక్షణ పద్ధతిలో పెంచాలి, ఇప్పుడు చూస్తున్న కాలంలో కల్లుబట్టిలకు, వైన్స్‌లకు పంపి వారికి మత్తు అలవాటు చేసే మార్గం చూపిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ శ్రీనివాస్, సీఐ కృష్ణ, ఎస్‌ఐ మహేష్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సుమలత, గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు, సభ్యులు, గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు, యువకులుపాల్గొన్నారు.

**డిచ్‌పల్లి:** యువత మత్తుపదార్థల జోలికి వెళ్లి జీవితాలను నాశనం చేసుకొవద్దని యువకులు తల్లిదండ్రుల ఆకాంక్షల మేరకు సన్మార్గంలో నడిచి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని యాంటీ నార్కోటిక్ బ్యూరో సీఐ శ్రీనివాస్ అన్నారు. కమిషనర్ సాయి చైతన్య ఆదేశాల మేరకు మండలం లోని ఘన్‌పూర్, సుద్దులం, యానంపల్లి, దూస్‌గాం గ్రామాల్లో నిర్వహించిన అవగాహన సదస్సుల్లో సీఐ పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీఐ మల్లేశ్, ఎస్సై షరీఫ్ ఆరోగ్య అధికారిని రాజ్యలక్ష్మీ, సూపర్‌వైజర్ పాల్గొన్నారు.

**భీమ్‌గల్ రూరల్:** యువత మత్తుకు బానిస కావొద్దని నారోకటిక్ సీఐ హేమలత అన్నారు. బుధవారం మండలంలోని బడాభీమ్‌గల్ గ్రామంలో తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ఆధ్వర్యంలో కల్తీకల్లు, మాదకద్రవ్యాల వినియోగంపై కలిగే నష్టాలపై ప్రజలకు, యువతకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యుడు అజయ్‌పవర్, ఎస్సై మహేష్, గ్రామ కమిటీ అధ్యక్షుడు కొట్టాల సాయిబాబా, రాగుల మోహన్, పిట్ల శ్రీనివాస్, మోర్తాడ్ లింబాద్రి, బాల్‌రెడ్డి, బాల్‌రాజ్ పాల్గొన్నారు.

**వేల్పూర్:** జీవితాలను నాశనం చేసే మాదక ద్రవ్యాలు, కల్తీకల్లుకు ప్రతీ ఒక్కరు దూరంగా ఉండాలని తెలంగాణ యాంటి నార్కోటిక్ బ్యూరో ఇన్‌స్పెక్టర్ రామునాయక్ సూచించారు. నిజామాబాద్ సీపీ ఆదేశాల మేరకు బుధవారం మండలంలోని పడిగెల, పచ్చల నడ్కుడ, వేల్పూర్ గ్రామాలలో తెలంగాణ యాంటీ నార్కోటిక్ బ్యూరో ఆధ్వర్యంలో కల్తీకల్లుపై, మాదక ద్రవ్యాలపై అవగాహన కల్పించారు.ఈకార్యక్రమంలో ప్రభుత్వ వై ద్యాధికారి శరత్‌చంద్ర, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉషారాణి, పోలీస్‌లు శైలాద్, శివ, హెడ్‌కానిస్టేబుల్ నారాయణ, సాయికిరణ్, మహిపాల్, ఆయా గ్రామాల పంచాయితీ కార్యదర్శులు, సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

**ఆర్మూర్ రూరల్:** యువత గంజాయి కల్తీకల్లు లాంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. పెర్కిట్, చేపూర్, ఆలూర్ మండలంలోని గుత్ప గ్రామాలలో బుదవారం తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు.ఈకార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి యాంటీనార్కోటిక్స్ బ్యూరో పుష్పన్‌కుమార్ మాట్లాడుతూ ప్రజలు మాదక ద్రవ్యాల వాడకాన్ని పూర్తిగా నివారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ ఎక్సైజ్ సీఐ రంజిత్‌రావ్, ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ గౌడ్, నందిపేట్ ఎస్సై చిరంజీవి, పంచాయితీ కార్యదర్శి తరుణ్, యువకులు, గ్రామస్థులు, మహిళలు పాల్గొన్నారు.

**ఎడపల్లి:** మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలు, కల్తీకల్లు ఆరోగ్యానికి హానికరమని యాంటీ నార్కోటిక్ బ్యూరో సీఐ రమేష్ రెడ్డి పేర్కొన్నారు. ఎడపల్లి మండల కేంద్రంతోపాటు మంగల్‌పాడ్, కుర్నాపల్లి, జానకంపేట గ్రామాలలో బుధవారం మాదక ద్రవ్యాలు, కల్తీకల్లుపై ప్రజలకు అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి వినీత్ రెడ్డి, ఎడపల్లి ఎస్సై వంశీ కృష్ణారెడ్డి, సహకార సంఘం అధ్యక్షుడు పోల మల్కారెడ్డి, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు, తదితరులు ఉన్నారు.

**మెండోర:** కల్తీకల్లు ఆరోగ్యానికి చిల్లు లాంటిదని యాంటీ నార్కోటిక్ సీఐ కృష్ణమూర్తి, మెండోర ఎస్సై యాసిర్ అర్ఫత్ అన్నారు. బుధవారం మండలంలోని మెండోర, వెల్కటూర్, దూదిగాం, చాకిర్యాల్ గ్రామాల్లో కల్తీకల్లు, మాదక ద్రవ్యాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ స్వాతి, సెక్రటరీలు రాజ్‌కుమార్, భరత్, అంగన్‌వాడి టీచర్లు, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

**భీమ్‌గల్:** పట్టణ కేంద్రంలోని సర్వసమాజ్ భవనంలో డ్రగ్స్, గంజాయి, కల్తీకల్లుపట్ల జరిగే అనార్థాలపై నార్కోటిక్ బ్యూరో సీఐ హేమలత ఆధ్వర్యంలో బుదవారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై మహేష్, జిల్లా చైల్డ్ వెల్ఫర్ ఆఫీసర్ దీప్‌సింగ్, డాక్టర్ అజయ్‌పవార్, ఎస్సైజ్ ఇన్స్పెక్టర్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో 65శాతం గాలికుంటు వ్యాధి నివారణ టీకాల పంపిణీ

● జిల్లా ఇన్‌చార్జి పశువైద్య అధికారి రోహిత్ రెడ్డి


అడ్కాస్‌పల్లిలో టీకాల పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న జేడీఏ

కోటగిరి,మే7(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాల పంపిణీ 65శాతం పూర్తయిందని జిల్లా ఇన్‌చార్జి పశువైద్య అధికారి రోహిత్ రెడ్డి తెలిపారు. కోటగిరి మండలంలోని అడ్కాస్‌పల్లి, బస్వాపూర్ గ్రామాలలో బుధవారం గాలికుంటు వ్యాధి నివారణ టీకాల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. టీకాల పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా ఇన్‌చార్జి పశువైద్య అధికారి రోహిత్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 2లక్షల పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల పంపిణీ కార్యక్రమం చేపట్టాల్సి ఉందన్నారు. గత నెల 15వ తేదిన ప్రారంభమైన టీకాల పంపిణీ కార్యక్రమం ఈ నెల 14వ తేదిన ముగుస్తుందన్నారు. ఇప్పటి వరకు 1,30,345 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశామన్నారు. మరో 35శాతం వారం రోజుల్లో పూర్తి చేస్తామన్నారు. రైతులు తమ పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పశువైద్య అధికారి సురేష్, పశువైద్య సిబ్బంది సుధీర్, సాయిలు, లక్ష్మి, గోపాల మిత్రులు రాములు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## జల్లాపల్లి ఆబాదిలో తాగునీటి సమస్య పరిష్కారం



ఆబాదిలో వాటర్ ట్యాంక్‌ను పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ మున్నీనాయక్

కోటగిరి,మే7(ఆంధ్రజ్యోతి): పొతంగల్ మండలంలోని జల్లాపల్లి ఆబాదీ గ్రామంలో బుధవారం తాగునీటి సమస్యను ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పరిష్కరించారు. ఆంధ్రజ్యోతి పత్రికలో ఖాళీ బిందెలతో నిరసన అనే కథనానికి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు స్పందించారు. బోధన్ ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మున్నీనాయక్ గ్రామంలో పర్యటించి తాగునీటి సమస్యపై వాకబు చేశారు. పైప్‌లైన్ లీకేజీతో పాటు గ్రామంలో వాటర్ మెన్ అందుబాటులో లేకపోవడంతో తాగునీటి సమస్య తలెత్తిందన్నారు. తాగునీటి సమస్యపై పంచాయతీ కార్యదర్శి పట్టించుకోవడం లేదని పలువురు డీఈకి ఫిర్యాదు చేశారు. పైప్‌లైన్ లీకేజీని అప్పటికప్పుడే అరికట్టి వాటర్ మెన్ నీటి సరఫరా విషయంలో నిర్లక్ష్యం చేస్తే తగిన చర్యలు తీసుకుంటామన్నారు. మిషన్ భగీరథ నీటి సరఫరా సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. ఆయన వెంట ఎంపీడీవో చందర్, ఆర్‌డ బ్ల్యూఎస్ ఏఈ ధన్‌రాజ్, పంచాయతీ కార్యదర్శి రాజలింగం, మిషన్ భగీరథ సిబ్బంది తదితరులున్నారు.

## అంత్యక్రియలకు వెళ్లి అనంత లోకాలకు..

● యంచ గోదావరిలో మునిగి వ్యక్తి మృతి

నవీపేట,మే7(ఆంధ్రజ్యోతి): మండలంలోని యంచ గోదావరిలో ప్రమాదవశాత్తు మునిగి నిజామాబాద్ అంబేద్కర్ కాలనీకి చెందిన మారంపల్లి గంగాధర్(45) మృతి చెందాడని ఎస్‌ఐ వినయ్ తెలిపారు. గంగాధర్ నిజామాబాద్ మున్సిపల్‌లో కూలీ పని చేసేవాడని మంగళవారం అతని సమీప బంధువు సాయమ్మ మండలంలోని యంచలో అనారోగ్యంతో మృతి చెందడంతో అదే రోజున గంగాధర్‌తో పాటు అతని భార్య సాయిలతతో కలిసి యంచకు వెళ్లడం జరిగిందని అన్నారు. సాయమ్మ అంత్యక్రియల అనంతరం పలువురు సమీపంలో ఉన్న యంచ గోదావరిలో కాళ్లు, చేతులు కడుక్కొని ఇంటికి చేరుకున్నారని అన్నారు. ఆ సమయంలో మారంపల్లి గంగాధర్ ఆచూకీ లభించకపోగా బుధవారం ఉదయం యంచ గోదావరిలో నీటిలో మృతదేహం తేలి ఉందని అన్నారు. అతడు కాళ్లు, చేతులు కడుక్కునే సమయంలో ప్రమాదవశాత్తు కాలు జారి గోదావరి నదిలో మునిగి మృతి చెంది ఉంటాడని భావిస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడి భార్య సాయిలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

## ఎంఐఎం పార్టీ బోధన్ అధ్యక్షుడిగా మీర్ ఇలియాజ్ అలీ

బోధన్‌రూరల్,మే7(ఆంధ్రజ్యోతి): బోధన్ ఎంఐఎం పార్టీ పట్టణ అధ్యక్షుడిగా మీర్ ఇలియాజ్ అలీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం మలకోపేట ఎమ్మెల్యే మహ్మద్ బిలలా సమక్షంలో బోధన్ పట్టణ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షుడిగా మీర్ ఇలియాజ్ అలీ, సెక్రెటరీగా హైమద్ బిన్ మొసిన్, కోశాధికారిగా ఖదీర్ ఖాన్‌తో పాటు 15 మందితో కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన మీర్ ఇలియాజ్ అలీ మాట్లాడుతూ పార్టీ అధినాయకత్వం అసదుద్దీన్ ఓవైసీ, మలకొపేట ఎమ్మెల్యే మహ్మద్ బిలాల తనపై నమ్మకం ఉంచి పట్టణ అధ్యక్షుడిగా నియమించినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంఐఎం పార్టీ నాయకులు తదితరులున్నారు.

## వీరబ్రహేంద్ర స్వామి ఆలయంలో ఉత్సవాలు

డిచ్‌పల్లి,మే 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మారం(బీ) పోతూలూరి వీరాబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో బుధవారం స్వామి వారికి అభిషేక అర్చన కార్యక్రమాలు నిర్వహించారు.

## పడిగెలలో బ్రహ్మంగారి ఆలయం వద్ద ఆరాధన ఉత్సవాలు

వేల్పూర్, మే 7(ఆంధ్రజ్యోతి): మండలం పడిగెల గ్రామంలో విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఆలయం వద్ద వీరబ్రహ్మేంద్రస్వామి 332 వ ఆరాధన ఉత్సవాలను ఘనంగా భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం అర్చన, అభిషేకం, మహిళలు మంగళహారతులతో వీరబ్ర హ్మేంద్ర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## భూ సమస్యలు పరిష్కరించేందుకే భూభారతి చట్టం

● రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్

మెండోర, మే 7(ఆంధ్రజ్యోతి): ప్రజల భూసమస్యలు పరిష్కరించేందుకే భూభారతి చట్టం అని రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్ అన్నారు. బుధవారం వెల్కటూర్ గ్రామంలో భూభారతి అవగాహన సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రజా ప్రభుత్వం తీసుకొచ్చిన భూభారతి దేశానికే రోల్ మోడల్ అవుతుందని అన్నారు. రైతులతో మాట్లాడి వారి సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. భూభారతి చట్టంపై అవగాహన కల్పించి రైతుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో ఆర్డీవో రాజగౌడ్, వేల్పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తింటి ముత్యంరెడ్డి, వైస్ చైర్మన్ నర్సారెడ్డి, తహసీల్దార్ సంతోష్‌రెడ్డి, ఆర్‌ఐ వేణుగోపాల్ చారి తదితరులు పాల్గొన్నారు.


వెల్గటూర్‌లో రైతుసదస్సులో పాల్గొన్న ఈరవత్రి అనిల్

## పల్లె దవాఖానలో కేంద్ర బృందం తనిఖీ


కేంద్ర బృందంతో పల్లె దవాఖాన సిబ్బంది

మోస్రా,మే7(ఆంధ్రజ్యోతి): చందూర్ మండల కేంద్రంలో గల పల్లె దవాఖానలో బుధవారం (ఎన్‌క్యూస్) కేంద్ర బృందం తనిఖీలు నిర్వహించింది. నేషనల్ క్వాలిటీ అష్యూరెన్స్ స్టాండర్స్ ద్వారా కేంద్రం, రాష్ట్రం నుంచి ఇద్దరు చొప్పున ఎక్స్‌టర్నల్ పరిశీలకులు వచ్చి దాని ప్రకారం మార్చి 20న ఆన్‌లైన్‌లో పరిశీలించి ఆకస్మికంగా పల్లె దవాఖాన పరిశీలించి ఎలాంటి సదుపాయాలు ఉన్నవి లేని సదుపాయాలు ఏమిటని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆన్‌లైన్ ద్వారా పరిశీలనలో 80 శాతం సర్వే పూర్తి కాగా బుధవారం పల్లె దవాఖానా సందర్శించి సిబ్బందితో మాట్లాడి పూర్తి వసతులను, ఔషధాలను పరిశీలించారు. కార్యక్రమంలో కేంద్ర బృందం డాక్టర్ కృష్ణ ప్రసాద్, డాక్టర్ దినేష్, కార్యక్రమం అధికారి డాక్టర్ రాకేష్, డీపీఎం విశాల రాణి, మండల వైద్య అధికారి విజయ్ కుమార్ పాల్గొన్నారు.

## మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తికి రెండు రోజుల జైలు

ఎడపల్లి,మే7(ఆంధ్రజ్యోతి): మద్యంతాగి వాహనం నడిపిన వ్యక్తికి బోధన్ కోర్టు రెండురోజుల జైలు శిక్ష విధించినట్లు ఎడపల్లి ఎస్సై వంశీ కృష్ణారెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఏప్రిల్ 14వ తేదీన చేపట్టిన డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులో పట్టుబడిన ఎడపల్లి గ్రామానికి చెందిన వ్యక్తిని బుదవారం బోధన్ కోర్టులో హాజరు పరుచగా స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ అతనికి రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు తెలిపారు. మద్యం తాగి వాహనం నడుపవద్దని, ఎవరైనా మద్యం తాగి వాహనం నడిపితే కఠిన చర్యలు ఉంటాయని ఎస్సై హెచ్చరించారు.

## ఉగ్రవాదం అంతం కావాల్సిందే

● బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

ఆర్మూర్ రూరల్, మే 7(ఆంధ్రజ్యోతి): ఉగ్రవాదం అంతం కావాల్సిందేనని పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులపై భారత సైన్యం ప్రదర్శించిన సైనిక పోరాటానికి ఒక భారతీయుడిగా గర్వపడుతున్నానని బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ఒక ప్రకటనలో అన్నారు. ఉగ్రవాదం ఉన్మాదం ఏ రూపంలో ఉన్న ప్రపంచ మానవాలికి నష్టం కల్గించేదే తప్ప లాభం చేకూర్చేదికాదన్నారు. ఈ విషయంలో పాజిటివ్‌గా ఆలోచించే ప్రపంచ శక్తులన్ని ఏకమై ఉగ్రవాదాన్ని అందమొందిస్తేనే శాంతి, సామరస్యాలు నెలకొంటాయన్నారు. భారత సైన్యానికి అభినందనలు తెలియజేస్తున్నానని ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు.

## రైతు ధర్నాను జయప్రదం చేయాలి

మోర్తాడ్, మే 7(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో బుధవారం అఖిల భారత వ్యవసాయ కాంగ్రెస్ సంఘం ఆధ్వర్యంలో గోడప్రతులను ఆవిష్కరించారు. హైదరాబాద్‌లోని ఇందిరా పార్కులో ఈనెల 8న జరుగనున్నా రైతు ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా పోస్టర్లను ఆవిష్కరించారు. కేంద్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మభ్యపెడుతున్నదని ఆరోపించారు.

## 'పార్టీ కోసం పనిచేస్తున్న వారికే పదవులు'


సమావేశంలో మాట్లాడుతున్న బల్మూరి వెంకట్

మోర్తాడ్, మే 7(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీలో క్రమశిక్షణతో పార్టీ కోసం పనిచేస్తున్న కార్యకర్తలు, నాయకులకే పదవులు దక్కుతాయని ఎమ్మెల్సీ పార్టీ పరిశీలకులు బల్మూరి వెంకట్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఆర్ఎస్‌బీ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశానికి ముఖ్య అతిథిగా పరిశీలకుడుగా హాజరయ్యారు. త్వరలో జరుగనున్న కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుల ఎన్నికల విదానం గురించి ఆయన వివరించారు. 2017 ముందు పార్టీలో పనిచేస్తున్న వారికి ప్రాముఖ్యత ఉంటుందని తర్వాత వచ్చిన వారికి మండ కమిటీల స్థానం లభించే అవకాశం ఉందని ఆయన వివరించారు. నాయకుల మధ్య విబేదాలు ఉన్నాయని కార్యకర్తలు వివరించారని ఈ విషయం పట్ల తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నానని అన్నారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు, సహకార సంస్థ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి, బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ముత్యాల సునీల్‌కుమార్, రాష్ట్ర కాంగ్రెస్ అధికార ప్రతినిధి వేణుగోపాల్ యాదవ్ , మైనింగ్ కార్పోరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్, సీడ్ కార్పోరేషన్ చైర్మన్ అన్వేష్‌రెడ్డి, కాంగ్రెస్‌పార్టీ పరిశీలకుడు, ఎస్టీ కార్పోరేషన్ చైర్మన్ తిరుపతి ప్రసంగించారు.

## ఒప్పంద ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్ అర్బన్, మే 7 (ఆంధ్రజ్యోతి): సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పారిశ్రామిక రంగాల పనితీరును మెరుగుపరిచేందుకు జిల్లా పరిశ్రమల కేంద్రంలో మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్ పోస్టుల కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ సురేష్‌కుమార్ తెలిపారు. ఇందులో భాగంగా జాతీయ సూక్ష్మ, చిన్న తరహా, మధ్యతరహా పరిశ్రమల సంస్థ జిల్లాకు ఈడీసీ మేనేజర్, ఈడీసీ అసిస్టెంట్ మేనేజర్ పోస్టులను కేటాయించడం జరిగిందని తెలిపారు. ఈ పోస్టులను కాంట్రాక్టు పద్ధతిన భర్తీ చేసేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు, 9640909831 నెంబర్లను సంప్రదించాలన్నారు.

## నిరుద్యోగులకు అవకాశం

దోమకొండ, మే 7(ఆంధ్రజ్యోతి): దోమకొండ ఫోర్ట్‌ట్రస్ట్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతి, యువకులకు ఉద్యోగ అవకాశాలు, ఇతర టెక్నాలజీపై అవగాహన కల్పిస్తున్నట్లు కోట ట్రస్ట్ మేనేజర్ బాబ్జి బుధవారం తెలిపారు. మ్యాజిక్ బస్ అనే సంస్థ కంప్యూటర్ శిక్షణను ఉచితంగా నేర్పించి, ఇతర నైపుణ్యాలను గుర్తించి వివిధ సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ట్రస్ట్ చర్యలు చేపడతుందన్నారు. పూర్తి వివరాలకు 9493143378 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

## రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు

దోమకొండ, మే7(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ పథకాల అమలులో కీలకం అయిన ప్రత్యేక రైతు విశిష్ట గుర్తింపు సంఖ్యకు సంబంధించిన నమోదు ప్రక్రియ ప్రారంభించామని మండల వ్యవసాయధికారిణి మణిదీపిక అన్నారు. బుధవారం రైతువేదికలో రైతుల వివరాలను నమోదు చేశారు. కార్యక్రమంలో ఏఈవోలు క్రిష్ణారెడ్డి, మాన్యూష, రైతులు పాల్గొన్నారు.

**సదాశివనగర్ :** ప్రతి రైతుకు ఆధార్ తరహాలోనే 11 నెంబర్లతో కూడిన యూనిక్ కోడ్‌ను నిర్వహించాలన్న కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో మండలంలోని ప్రతిరైతుకు రిజిస్ట్రేషన్ చేశామని వ్యవసాయాధికారి ప్రజాపతి తెలిపారు. బుధవారం మండలంలోని అమర్లబండలో ఏఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరైతుకు తనకున్న భూముల వివరాలతో ఈ రిజిస్ట్రేషన్‌ను చేయడం జరుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం అందించే పీఎం కిసాన్ పథకం, తదితరులకు మలి విడత అందజేయడానికి ఈ కోడ్ ఉపయోగపడుతుందన్నారు. ప్రతి రైతు తప్పకుండా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు.

## స్కిల్‌డెవలప్‌మెంట్ శిక్షణ కార్యక్రమం ప్రారంభం

భిక్కనూరు, మే 7(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో జిల్లా మహిళా సాధికారత కేంద్రం, ఎస్‌బీఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణా కార్యక్రమాన్ని జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిణి ప్రమీల బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ శిబిరంలో శిక్షణపొందిన వారికి ప్రభుత్వం నుంచి కావాల్సిన ప్రోత్సాహం ఉంటుందన్నారు. కార్యక్రమాన్ని నిరుద్యోగ యువ తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో దోమకొండ సీడీపీవో రోజిష్మ, మహిళా సాధికారత కేంద్రం సిబ్బంది శిరీష, గ్రామపంచాయతీ ఈవో మహేష్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యాన్ని వెంటనే తూకం వేయాలి : ఆర్డీవో

భిక్కనూరు, మే 7 (ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రానికి వచ్చిన ధాన్యాన్ని వెంటనే తూకం వేసి రైస్‌మిల్లులకు తరలించాలని ఆర్డీవో వీణ అన్నారు. బుధవారం మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామంలోని కొనుగోలు కేంద్రాన్ని ఆర్డీవో పరిశీలించారు. ఈ మేరకు ఆమె మాట్లాడుతూ అకాల వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కొనుగోలు కేంద్రాల వద్ద తప్పకుండా టార్పలిన్‌లు అందుబాటులో ఉంచాలని, కేంద్రానికి వచ్చిన ధాన్యాన్ని వెం టవెంటనే తూకం చేసి ట్యాబ్‌లో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో డీఎం రాజేందర్, డీసీఎస్‌వో మల్లిఖార్జున్, విండో చైర్మన్ రాజాగౌడ్, తహసీల్దార్ శివప్రసాద్, డీటీ కిష్టయ్య, సీఈవో మోహన్‌గౌడ్, ఏఈవో లత పాల్గొన్నారు.

## ఆరునెలల్లో శాశ్వత టోల్‌ప్లాజా పనులు పూర్తి

● ఎన్‌హెచ్‌ఏఐ పీడీ శ్రీనివాసరావు

భిక్కనూరు, మే 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎడ్లకట్టవాగు సమీపంలో 44వ జాతీయ రహదారిపై ఆరునెలల్లో శాశ్వత టోల్‌ప్లాజా నిర్మాణం చేపట్టామని ఆరునెలల్లో ఈ నిర్మాణాన్ని పూర్తిచేస్తామని నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా పీడీ శ్రీనివాసరావు అన్నారు. బుధవారం శాశ్వత టోల్‌ప్లాజా నిర్మాణ పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. టోల్‌ప్లాజాను అన్నిహంగులతో నిర్మించామని, శాశ్వత నిర్మా ణ పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయన్నారు. టోల్‌ప్లాజాలో ఎవ్వరికి మిన హాయింపు లేదని లోకల్ వాహనాలకు పాస్‌లు ఏర్పాటు చేయాలన్నారు.





అధ్వానంగా తయారైన టీటీడీసీ భవనాలు



అగ్ని ప్రమాదంలో కాలిపోయిన కంప్యూటర్ గది



వృథగా పడి ఉన్న జనరేటర్

# నాడు కళకళ.. నేడు వెలవెల

● అధ్వానంగా మారిన టీటీడీసీ కేంద్రం
● దొంగల పాలవుతున్న సామగ్రి
● పట్టించుకోని డీఆర్‌డీవో అధికారులు

డిచ్‌పల్లి, మే 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఏకైక టెక్నికల్ ట్రైజామ్ కేంద్రం డిచ్‌పల్లిలో 2010 సంవత్సరంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వంలోని మంత్రులు బొజ్జల గోపాల కృష్ణారెడ్డి, మండవ వెంకటేశ్వరరావు గ్రామీణ నిరుద్యోగ యువతి, యువకులకు పలు రకాల ఉచిత శిక్షణలు ఇచ్చేందుకు టీటీడీసీ కార్యాలయం ఏర్పాటు చేశారు. కొన్నేళ్ల పాటు సేవలందించిన ఈ టీటీడీసీ మూడేళ్లుగా ఆలనా పాలన కరువై పూర్తిగా జిల్లా డీఆర్‌డీవో అధికారులు మూసివేశారు. ఎంతో మంది నిరుద్యోగులకు, ఐకేపీ మహిళా సమాఖ్యల సమావేశాలకు సేవలందించిన ఈ కార్యాలయం శిథిలావస్థకు చేరింది. నాడు ఒక వెలుగు వెలిగిన ఈ టీటీడీసీ నేడు కళావిహీనంగా తయారైంది. జిల్లాలో నిరుద్యోగ యువతకు ప్రభుత్వం తరుపున ఉచితంగా శిక్షణ లు ఇచ్చే ఈ కార్యాలయం మూసి వేయడంతో నిరుద్యోగులకు ఆర్థిక భారం పడి ప్రైవేట్ సంస్థలలో శిక్షణలు పొందుతున్నారు. కంప్యూటర్ ట్రైనింగ్, టైలరింగ్ వంటి ఉచిత శిక్షణలు ఈ కార్యాలయంలో అందించేవారు. అదేవిధంగా గతంలో జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన డీవీ రాయుడు జిల్లా కార్యకలాపాలు ఇక్కడి నుంచే కొనసాగించి ఒక మినీ కలెక్టర్‌గా తీర్చిదిద్దారు. అంతటి ప్రాముఖ్యత ఉన్న ఈ కార్యాలయం పాడుపడి మూసివేయంతో మహిళ సమాఖ్య సమావేశాలకు, నిరుద్యోగుల సేవలకు దూరమైంది. ఆలనా పాలన కరువవడంతో కార్యాలయంలోని తలుపులు, ఏసీలు, కంప్యూటర్ పరికారాలు, జనరేటర్ వంటివి గుర్తు తెలియని దొంగలు చోరీలు చేస్తున్నారు. రాత్రి సమాయంలో మద్యం ప్రియులకు అడ్డగా మారి అసాంఘిక కార్యాక్రమాలు జరుగుతున్నా యని స్థానికులు వాపోతున్నారు. గత 6 నెలల క్రితం డీఆర్‌డీవో పీడీ సాయాగౌడ్ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి కేంద్రాన్ని సందర్శించిన ఫలితం శూన్యం. కావున ఇప్పటికైనా ఎమ్మెల్యే భూపతిరెడ్డి, జిల్లా ఉన్నతాధికారులు, స్పందించి తిరిగి టీటీడీపీ పునఃప్రారంభించాలని నిరుద్యోగ యువతీ యువకులు, మహిళ సమాఖ్య సంఘాలు కోరుతున్నారు.

# సమయ పాలన పాటించని అధికారులు

● కార్యదర్శి రాకకు నిరీక్షణ చేసిన జుక్కల్ ప్రజలు ● డుమ్మా కొట్టే అధికారులకు పరోక్ష మద్దతిస్తున్న జుక్కల్ ఎంపీడీవో




జుక్కల్ గ్రామ పంచాయతీ కార్యాలయం



12.33ని.లకు తాళం వేసి ఉన్న దృశ్యం

జుక్కల్, మే 7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో 12.33 నిమిషాలు సమయం అయినప్పటికీ జుక్కల్ గ్రామపంచాయతీ కార్యాలయం తాళం వేసి ఉంది. కార్యాలయంకు పనికోసం వచ్చిన జుక్కల్ ప్రజలకు తాళం చూసి అవాక్కయ్యారు. జుక్కల్ మండల కేంద్రంలో పంచాయతీ కార్యదర్శి విధుల పట్ల ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్లు జుక్కల్ ప్రజలు బహిరంగంగా చర్చించుకుంటున్నారు. బుధవారం రోజు జుక్కల్ ప్రజలు ఇంటి పన్ను కడతామని వెళ్లిన వారికి కార్యదర్శి అందుబాటులో లేకపోవడంతో పంచాయతీ భవనానికి తాళం ఉండడంతో ప్రజలు కార్యదర్శి రాక కోసం నిరీక్షించారు. పంచాయతీ కార్యదర్శితో పాటు సిబ్బంది అందుబాటులో ఉండడం లేదని ఆరోపిస్తున్నారు. పంచాయతీ కార్యదర్శులు హెడ్ క్వార్టర్‌లో ఉండకుండా ఇతర మండలాల నుంచి గ్రామాల నుంచి రాకపోకలు సాగిస్తూ వారికి వచ్చిన విధంగా వారానికి మూడు నాలుగు రోజులు విధులు నిర్వహిస్తూ సమయపాలన పాటించకుండా వారి ఇష్టానుసారంగా సమయపాలన పాటించకుండా నామమాత్రంగా విధులు నిర్వహిస్తున్నట్లు ప్రజలు పేర్కొంటున్నారు. పంచాయతీ కార్యదర్శులు ఎంపీడీవోతో దోస్తాన చేస్తూ డుమ్మా కొట్టే పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీవో పరోక్ష మద్దతిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం ఉంది. జుక్కల్ పంచాయతీ కార్యదర్శిపై సంబంధిత ఉన్నత అధికారులు పూర్తిస్థాయి విచారణ జరిపి తగు చేరే తీసుకోవాలని జుక్కల్ మండల్ ప్రజలు డిమాండ్ చేశారు.

● జుక్కల్ ఎంపీడీవో వివరణ

జుక్కల్ పంచాయతీ కార్యాలయానికి సమయం 12.30 అయినప్పటికీ కార్యాలయానికి తాళం వేసి ఉంది. కార్యదర్శి, సిబ్బంది ఎవరు లేరని జుక్కల్ ఎంపీడీవోను ప్రశ్నించగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల సమాచారం విలేకరులకు చెప్పాల్సిన అవసరం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

# ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులకు వసతులు కరువు

● ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

నసురుల్లాబాద్, మే 7 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్టాండ్‌లో సౌకర్యాలు లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. నస్రుల్లాబాద్ మండల పరిధిలోని నిజామాబాద్, బాన్సువాడ, బోధన్, హైదరాబాద్, వెళ్లే ప్రయాణికులు మండల కేంద్రమైన నసురుల్లాబాద్ బస్టాండ్, కనీసం బస్టాండ్ లో ప్రయాణికులకు, మరుగుదొడ్లు లేక, తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కనీసం మండల కేంద్రమైన బస్టాండ్‌లో, చుట్టుపక్క మండలాల ఉండే కాకుండా ఇతర గ్రామాల నుంచి వచ్చి ప్రయాణికులు బస్సుల కోసం ఎదురుచూస్తుంటే, సమయానికి బస్సులు రాకపోవడంతో, మూత్రశాలలు మరుగుదొడ్లు లేక ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. అలాగే మండల పరిధిలోని కంశేట్‌పల్లి, దుర్కీ, గ్రామాల్లో, బస్టాండ్‌లు, శిథిలావస్థలోకి చేర డంతో, ప్రయాణికులు, కనీసం నిల్చుందామంటే, నీడ లేక రోడ్డుపైనే ప్రయాణికులు గంటల తరబడి నిల్చుంటున్నారు, ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు, గ్రామాల్లో ఆర్టీసీ బస్టాండ్లలో, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా, శిథిలావస్థలోకి చేరిన బస్టాండ్, మరమ్మత్తులు చేసి ప్రజలకు అందుబాటులో తీసుకురావాలని, మండల ప్రజలు కోరుతున్నారు. అలాగే నూతనంగా ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత, కూడా ప్రజల సౌకర్యాలు పట్టించు కోవడం లేదని, నిత్యం ప్రయాణించే ప్రయాణికుల ఇబ్బందులు గమనించి, ఆర్టీసీ అధికారులు ప్రజలకు, ఆర్టీసీ ప్రాంగణం లో, మరుగుదొడ్లు నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ప్రయాణికులు కోరుతున్నారు.




నసురుల్లాబాద్ బస్టాండ్

● ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించాలి

నసురుల్లాబాద్ ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించాలని ప్రయాణికులు కోరుతున్నారు. తరచూ ప్రయాణీకులు నసురుల్లాబాద్ నుంచి బోధన్, నిజామాబాద్, హైదరాబాద్‌కు తరలి వెళ్తుంటారు. కాని బస్టాండ్‌లో కనీస సౌకర్యాలు లేక ఇబబందులు పడుతున్నాం.

● సాయి, ప్రయాణికుడు

# కంపు కొడుతున్న గాంధారి వాగు

● గాంధారి వాగులో ఇష్టారీతిన చెత్తా చెదారం వేస్తున్న జనం
● పట్టించుకోని గ్రామ పంచాయతీ సిబ్బంది
● తీవ్ర దుర్గంధంతో ప్రయాణికులకు ఇబ్బందులు



వాగులో చెత్తాచెదారం వేసిన దృశ్యం

గాంధారి, మే 7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రధాన వాగులో చెత్తా చెదారంతో పాటు కోళ్ల వ్యర్థపదార్థాలు రాత్రివేళలో వేయడంతో వాగు కంపు కొడుతుంది. గాంధారి, కామారెడ్డి, బాన్సువాడ ప్రధానరహదారి వాగుపై నుంచే ఉండగా ఈ దారి గుండా ప్రయా ణిస్తున్న వారికి తీవ్ర దుర్గందం రావడంతో ముక్కుమూసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. వ్యర్థాలతో వాగు పూర్తిగా నిండిపోవడంతో పశువులు వాగులోని నీటిని తాగడానికి వెళ్లి రోగాల బారిన పడుతున్నాయి. రాత్రివేళలో దుకాణ యాజమానులు వ్యర్థపదార్థాలు బ్రిడ్జిపై నుంచి వాగులో వేయడంతో వాగు మొత్తం దుర్గంధ భరితం అవుతుంది. ఇంత జరుగుతున్న పంచాయతీ సిబ్బంది అటువైపు కన్నెతి చూడక పోవడం శోచనీయమని ప్రజలు పేర్కొంటున్నారు. ప్రతీ సంవత్సరం గాంధారి వాగులోనే వినాయక నిమజ్జనంతో పాటు బతుకమ్మలను నిమజ్జనం చేస్తారు. అలాంటి వాగును ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఇక మండల కేంద్రంలోని మొకరం చెరువులో కొందరు పీఎంపీ, ఆర్ఎంపీలు వాడిన సూదులు, వ్యర్థాలను వేయడంతో గంగపుత్రులు చేపలు పట్టడానికి వెళ్లి అనారోగ్య పాలవుతున్నారు. కాళ్లకు సూదులు గుచ్చుకుంటున్నాయని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వాగుతో పాటు మొకరం చెరువులో వ్యర్థాలు వేయకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

# ఘనంగా వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన



నవీపేటలో వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన మహోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

నవీపేట, మే7 (ఆంధ్రజ్యోతి): పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి 332వ ఆరాధన మహోత్సవం బుధవారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో జరిగిన కార్యక్రమంలో కలశ స్థాపన, గణపతి పూజ, పుణ్యవచనం, యజ్ఞం, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షులు భూమాచారి, ప్రభాకర్, కృష్ణ, శివకుమార్, శ్రీనివాస్, చందు తదితరులున్నారు.

# కమనీయం.. పద్మావతి వేంకటేశ్వర స్వామి కల్యాణం

కోటగిరి, మే 7 (ఆంధ్రజ్యోతి): రుద్రూరు మండలంలోని అక్బర్‌నగర్ గ్రామంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం పద్మావతి వెంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం కమనీయంగా గా జరిగింది. వేద పండితులు శ్రీనివాస్ శర్మ, రోహిత్ శర్మలచే పద్మావతి వెంకటేశ్వర స్వామి కల్యాణంకన్నుల పండువగా సాగింది. కల్యాణ వేడుకలకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గంగామణి, నాయకులు వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



అక్బర్‌నగర్‌లో పద్మావతి, వేంకటేశ్వర స్వామి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

# ఆరోగ్య సంరక్షణకు తోడు.. నేరేడు పండ్లు



రామారెడ్డి, మే 7 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా కేంద్రానికి పది కిలో మీటర్ల దూరంలో ఉన్న రామారెడ్డి మండలంలో అల్లనేరేడు పండ్లు జోరుగా అమ్మకాలు కొనసాగుతున్నాయి. రామారెడ్డి మండల కేంద్రంతో పాటు రెడ్డిపేట్, అన్నారం, మద్దికుంట, సింగిరాయిపల్లి, పోసానిపేట్, ఉప్పల్వాయి, ఇసన్నపల్లి తదితర గ్రామాల్లో, తండాల్లో జోరుగా అల్ల నేరేడు పండ్లు జోరందుకున్నాయి.

● ఔషధాల పండ్లు


అల్లనేరేడు పండ్లు అంటూ అమ్మకాలు జోరుగా కొనసాగుతున్నాయి. ఔషధ గుణాలు కలిగిన అల్లనేరేడు పండ్లు తినాలని పెద్దలు చెబుతున్నారు. ఒకప్పుడు గ్రామాల్లో, తండాల్లో పుష్కలంగా అల్ల నేరేడు పండ్లు పుష్కలంగా ఉండేవి. ఇప్పుడు చెట్లను క్రమంగా నరుకుతున్నారు. రెండు నెలలుగా అల్లనేరేడు పండ్లు అమ్మకాలు జోరుగా కొనసాగు తున్నాయి. కాగా అల్లనేరేడు పండ్లు చెట్లు రైతులు నరికివేత కొనసాగుతోంది. గతంలో అల్ల నేరేడు పండ్లు విచ్చలవిడిగా అమ్మకాలు కొనసాగుతుండేవి. ప్రస్తుతం అమ్మకాలు తగ్గడంతో ఆరోగ్యం కోం ప్రజలు ఎదురు చూస్తున్నారు.

● ఆరోగ్యానికి ఎంతో మేలు అల్ల నేరేడు పండ్లు



ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే అల్ల నేరేడు పండ్లు ఈ కాలంలో లభిస్తాయి. అల్ల నేరేడు పండ్లు తింటే ఎలాంటి వ్యాధులు రావడానికి వీలు ఉండదు. దీంట్లో క్యాల్షియం, ఇనుము, పొటాషియం, విటమిన్, ఏ, ఈ ఉంటాయని ఆరోగ్యం మెరుగు పడుతుంది.

● డాక్టర్ సురేష్, ప్రభుత్వ వైద్యాధికారి



తారు ఊడిపోయి మట్టిరోడ్డును తలపిస్తున్న వేల్పూర్, అంక్సాపూర్ రోడ్డు




కొత్తపల్లి( కే) గ్రామ సమీపంలో గుంతలుగా ఏర్పడిన బీటీ రోడ్డు దుస్థితి



సాహెబ్‌పేట్, గోవింద్‌పేట్ గ్రామాల మధ్య కంకర తేలి అధ్వానంగా మారిన రోడ్డు

# అధ్వానంగా మారిన రహదారులు

● వేల్పూర్ వద్ద ఇబ్బంది పడుతున్న వాహనదారులు ● చోద్యం చూస్తున్న అధికారులు

వేల్పూర్, మే 7 (ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండలంలోని పలు గ్రామాల రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. రోడ్లు పూర్తిగా దెబ్బతిని గుంతలమయంగా మారడంతో ఈ రోడ్లపై వెళ్లాలంటే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తారురోడ్లపై తారు చాలాచోట్ల పూర్తిగా ఊడిపోయి కంకరరాళ్లు తేలి గుంతలు ఏర్పడ్డాయి. ఈ రోడ్డున చిన్న బ్రిడ్జికి ఇరువైపులా ఉన్న రక్షణ స్తంభాలు కూడా పూర్తిగా విరిగిపోయి ప్రమాదకరంగా ఉంది. వేల్పూర్ నుంచి రైస్ మిల్లు నుంచి అంక్సాపూర్ వెళ్లే రహదారి, పచ్చల నడ్కుడ బుడిగెడు చెరువు కాలువ మూలమలుపు నుంచి మోతె, అక్లూర్ గ్రామానికి వెళ్లే రోడ్లు, సాహెబ్‌పేట్ గ్రామం నుంచి గోవింద్‌పేట్‌కు వెళ్లే రోడ్లపై బీటీ ఊడిపోయి అక్కడక్కడ కంకరాళ్లు తేలి పెద్ద గుంతలు ఏర్పడి ప్రమాదాలకు నిలయంగా మారాయి. ఈ రోడ్ల వెంబడ చాలాచోట్ల గుంతలు ఏర్పడి కంకరరాళ్లు తేలడం వల్ల ప్రయాణించే టప్పుడు ఎక్కువ సమయం పడుతుందని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్లపై నిత్యం ఇతర మండలాల గ్రామాలకు వెళ్లడమే కాకుండా వ్యవసాయ పనుల కోసం వందల సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటారు. ఇలాంటి దెబ్బతిన్న రోడ్లపై వెళ్లాలంటే ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడాల్సి వస్తుంది. గత ఏడాది కురిసిన భారీ వర్షాలకు పలురోడ్లకు అక్కడక్కడ కోతకుగురై ప్రమాదకరంగా ఉన్నప్ప టికి నేటికి వాటికి మర మ్మతులు చేపట్టలేదు. ఇలాంటి గుంతలు పడిన రోడ్లపై వెళ్తు వాహన దారులు ప్రమాదాల భారీన పడుతున్నారు. అంతేకాకుండా వా హనాలు కూడా దెబ్బతింటున్నాయని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదకరంగా ఉన్న ఈ రోడ్లను మరమ్మతులు చేయాల్సిన ఆర్అండ్‌బీ అధికారులు మాత్రం చూసీచూడనట్లుగా వ్యవహరించడం పట్ల ప్రజలు ఆవేధన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదాలు జరుగకముందే రోడ్లను బాగుచేయాలని వాహనదారులు కోరుతున్నారు.



కోతకు గురైన పచ్చల నడ్కుడ, అక్లూర్ రోడ్డు

రాకపోకలకు ఇబ్బందిగా ఉంది

● గంగాధర్‌గౌడ్, కొత్తపల్లి( కే), గ్రామవాసి



వేల్పూర్ నుంచి కొత్తపల్లి కే గ్రామం బీదుగా అంక్సాపూర్ వెళ్లే రోడ్డుపై రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. ఈ రోడ్డుపై కంకరరాళ్లు తేలి గుంతలు అధికంగా ఉండడం వల్ల ప్రయాణించాలంటే తీవ్ర అంతరాయం కలుగుతుంది. దీంతో తక్కువ దూరానికి ఎక్కువ సమయం పడుతుంది. వాహనాలు దెబ్బతింటున్నాయి. ఇప్పటికైనా అధికారులు రోడ్డు మరమ్మతులు చేపట్టాలి.




## పీహెచ్‌సీని తనిఖీ చేసిన కాయకల్ప బృందం


ఆసుపత్రి సిబ్బందితో డీసీవో

మద్నూర్, మే 7 (ఆంధ్రజ్యోతి) : డోంగ్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని బుధవారం జిల్లా కాయకల్ప బృందం అధికారులు డీసీవో పద్మజా, జిల్లా క్వాలిటీ కంట్రోల్ అధికారి జహీరాబేగం, సిబ్బంది తనిఖీ చేశారు. ఆసుపత్రిలో మౌలికసదుపాయాలను పరిశీలించి రోగులకు అందిస్తున్న సేవల గురించి ఆరా తీశారు. కార్యక్రమంలో డోంగ్లి పీహెచ్‌సీ వైద్యురాలు శ్రీలేఖ, సీహెచ్‌వో రహిజా పర్వీన్, సూపర్‌వైజర్ లక్ష్మి, ఫార్మసిస్ట్ రాములు, స్టాఫ్ నర్సు మంజుల ఉన్నారు.

## హుండీ లెక్కింపు విషయంలో ఇరువర్గాల ఘర్షణ

బీర్కూర్, మే 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బైరాపూర్ గ్రామంలో రుక్మిణి విఠలేశ్వర ఆలయ హుండీ ఆదాయం లెక్కింపు విషయంలో ఇరు వర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. మాజీవీండో అధ్యక్షులు మొగులు గొండ తనపై కొంత మంది దాడి చేశారంటూ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు 13 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం బైరాపూర్ గ్రామంలో రుక్మిణి విఠలేశ్వర ఆలయం ఉంది. అయితే గత సంవత్సరం కాలంగా ఆలయ హుండీ ఆదాయం లెక్కించలేదు. 5వ తేదిన హుండీ డబ్బులు లెక్కించనున్నట్లు, 4వ తేదిన రాత్రి గ్రామంలో డండోరా ఇప్పించారు. 5వ తేదిన ఉదయం గ్రామస్తులు అందరూ ఆలయం వద్దకు చేరుకున్నారు. ఇదిలా ఉండగా కొంత మంది హుండీ లెక్కింపును అడ్డుకున్నారు. ఆలయ ఆదాయ, వ్యయాల లెక్కలు తేల్చాకే హుండీ ఆదాయం లెక్కించాలని పట్టుబట్టారు. ఈ విషయమై ఇరు వర్గాల మధ్య వాగ్వివాదం చోటు చేసుకుని ఘర్షణలకు దారి తీసింది. అయితే గ్రామానికి చెందిన మొగులు గొండ అనే వ్యక్తి తనపై కొంత మంది ఉద్దేశ పూర్వకంగా దాడి చేశారంటూ పోలీస్‌స్టేషన్‌లో అదే రోజు ఫిర్యాదు చేశారు. మాజీ జడ్పీటీసీ సతీష్‌తో పాటు మరో 12 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## పోతంగల్, కుర్దులో రెండు ఇళ్లల్లో చోరీ

గాంధారి,మే 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతంగల్ కుర్దు గ్రామంలో రెండు ఇళ్లలో మంగళవారం రాత్రి చోరీ జరిగినట్లు ఎస్‌ఐ ఆం జనేయులు తెలిపారు. గ్రామానికి చెందిన కుమ్మరి రోజా వద్ద రమేష్ ఇంట్లో కిరాయికి ఉంటుంది. మంగళవారం రాత్రి తన తల్లిగారింట్లో పడుకోవడానికి వెళ్లగా ఇంట్లో దొంగలు పడి ఏడున్నర మసాల బంగారం, 12 తులాల వెండి, కొంత నగదు దోచుకుని పోయారు. అదేగ్రామంలో ఆ ఇంటికి దగ్గరలోనే ఉన్న కొర్రి గౌరవ్వ రాత్రి బయటపడుకోగా వర్షం పడడంతో ఇంట్లోకి వెళ్లింది. ఇంట్లోకి వెళ్లిన తలుపులు పెట్టుకోకపోవడంతో ఇంట్లోకి గుర్తుతెలియని వ్యక్తులు వచ్చి బెదిరించి నగదు, 12 తులాల వెండి, బంగారు గుండ్లను చోరీ చేశారు. ఇరువురు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

## దరఖాస్తులకు ఆహ్వానం

ఎల్లారెడ్డి, మే 7 (ఆంధ్రజ్యోతి): పట్టణ కేంద్రంలో ఉన్న మైనార్టీ బాలుర గురుకుల పాఠశాలలో అడ్మిషన్లకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మహ్మద్‌రఫీక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదోతరగతిలో 40 సీట్లకు అడ్మిషన్లు నిర్వహించామన్నారు. నాన్ మైనారిటీ విద్యార్థులకు ఈనెల ఏడోతేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని ఈనెల 8న లక్కీ డ్రా ద్వారా అడ్మిషన్లను ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

## 'ప్రమాదంలో కార్మికుల భవిష్యత్తు'

కామారెడ్డిటౌన్, మే 7 (ఆంధ్రజ్యోతి): లేబర్‌కోడ్‌లను రద్దుచేయకుంటే కార్మికుల భవిష్యత్తు ప్రమాదంలో పడ్డట్టేనని సీఐటీయూ రాష్ట్రకార్యదర్శి పాలడుగు భాస్కర్ అన్నారు. బుధవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని రోటరీక్లబ్‌లో మున్సిపల్ కార్మికుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. అంబేద్కర్ రాజ్యాంగంలో పొందుపరిచిన ఆర్టికల్ 14 సెక్షన్ సీ ప్రకారం కార్మికులు తమ హక్కులను కాపాడుకునేందుకు వారు పనిచేస్తున్న పరిధిలో సంఘాన్ని ఏర్పాటుచేసుకుని వారి సమస్యలను సాధించుకునేం దుకు సమ్మెచేసే అవకాశాన్ని చట్టం ఇస్తుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ రాష్ట్రకార్యదర్శి సుధాకర్, మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కందారపు రాజనర్సు మున్సిపల్ నాయకులు పాల్గొన్నారు.

## దళిత రత్న అవార్డును అందుకున్న జిల్లా అధ్యక్షుడు

రామారెడ్డి, మే 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో బుధవారం దళితరత్న అవార్డులను అందజేశారు. కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం కామారెడ్డి జిల్లా అధ్యక్షులు మద్దెల భాగయ్యకు దళితరత్న అవార్డు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఎస్సీ విభాగం కామారెడ్డి జిల్లా అధ్యక్షులు మద్దెల భాగయ్య మాట్లాడుతూ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ చేతుల మీదుగా దళితరత్న అవార్డు అందుకోవడం చాలా గర్వంగా ఉందన్నారు.

## అనుమతి లేని పాఠశాలపై చర్యలు తీసుకోండి

● ఎంఈవోకు వినతి


ఎంఈవోకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నసురుల్లాబాద్, మే 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎక్స్‌రోడ్డులో అభి ఇంటర్నేషనల్ ప్రైవేట్ స్కూల్ అనుమతి వచ్చిందని అడ్మిషన్లు, ప్రచారాలు కొనసాగిస్తున్నారని బుధవారం బీసీ విద్యార్థి సంఘం ఉమ్మడి జిల్లా వర్కిం గ్ ప్రెసిడెంట్ దత్తు ఆల్‌ఇండియా స్టూడెంట్స్ బ్లాక్ జిల్లా అధ్యక్షులు రవీందర్‌గౌడ్, ఎంఈవో చందర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ విషయంపై నసురుల్లాబాద్ మండల విద్యాశాఖ అధికారి వివరణ కోరగా నసురుల్లా బాద్ మండల కేంద్రంలోని అభిఇంటర్నేషనల్ ప్రైవేట్‌స్కూల్‌కి ఎలాంటి పర్మిషన్ లేదని, విద్యా శాఖ కార్యాలయం నుంచి ఆ స్కూల్‌కి ఎటువంటి ధ్రువీకరణ ఇవ్వలేదని ఆయన చెప్పారు.

## ఉప్పల్‌వాయి ఆరోగ్య సబ్‌సెంటర్ తనిఖీ

రామారెడ్డి, మే 7 (ఆంధ్రజ్యోతి): ఉప్పల్‌వాయి, పోసానిపేట్ ప్రభుత్వ ఆరోగ్య ఉపకేంద్రాలను బుధవారం రామారెడ్డి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సురేష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు స్క్రీనింగ్ చేయాలని సూచించారు. పిల్లలకు సకాలంలో టీకాలు వేసి వంద శాతం టీకాల నమోదు అయ్యేట్లు చూడాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో బీరమ్మశ్రీ, హెల్త్ ఎడ్యుకేటర్ భీమ్ , హెల్త్ సూపర్ వైజర్ జానకి, ఏఎన్ఎం చంద్రకళ, ఆశ, సవిత, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జంగంపల్లిలో గొర్రెల మందపై వీధికుక్కల దాడి

భిక్కనూరు, మే 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని జంగంపల్లి గ్రామంలో బుధవారం తెల్లవారుజామున గొర్రెలమందపై వీధికుక్కలు దాడిచేయగా తొమ్మిదిగొర్రెలు మృత్యువాత పడినట్లు పశువైద్యాధికారి అనీల్, ఆర్‌ఐ బాలయ్య తెలిపారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి మాట్లాడుతూ గ్రామానికి చెందిన దోడ్లనవీన్ తన గొర్రెల మందను ప్రతిరోజులాగానే మంగళవారం రాత్రి తన కొట్టంలో వదిలి ఇంటికి వెళ్లాడు. ఉదయం మంద వద్దకు వచ్చిచూడగా కుక్కలు గొర్రెల మందపై దాడి చేయగా ఎనిమిది గొర్రెలు ఒక మేక మృత్యువాతపడ్డాయి. ఈ మేరకు ఆర్‌ఐ బాలయ్య పంచనామా నిర్వహించి రూ.70వేల నష్టం వాటిల్లినట్ల తెలిపారు. అనంతరం బాధితుడు నవీన్ మాట్లాడుతూ తమది గొర్రెలపైనే జీవనాధారమని ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరారు.

## ముగిసిన ఎల్లమ్మ ఉత్సవాలు

దోమకొండ, మే 7(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శ్రీ రేణుకా (ఎల్లమ్మ) జమదగ్నిల 20వ వార్షికోత్సవ ఉత్సవాలు బుధవారం ముగిశాయి. ఉదయం తిరుగుబోనాల కార్యక్రమం, ఆలయంలో ప్రత్యేకపూజలు, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీ రేణుకా ఎల్లమ్మ దేవాలయ కమిటీ, గౌడసంఘం సభ్యులు పాల్గొన్నారు.

# అధికారులు పంట నష్టంపై నివేదిక ఇవ్వాలి

● కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి


తడిసిన ధాన్యపు సంచులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

కామారెడ్డిటౌన్, మే 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అడ్లూర్, చిన్న మల్లారెడ్డి గ్రామాల్లో కొనుగోలు కేంద్రాల వద్ద వడగళ్ల వానకు తడిసిన ధాన్యాన్ని బుధవారం కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగళ వారం రాత్రి అకాల, వడగండ్ల వర్షం కారణం గా కేంద్రాల వద్ద ఉన్న వరి, మొక్క జొన్న పూర్తిగా తడిసిపోయిందని, కోత కాని పంటలు సైతం నేలకొరగడంతో రైతులు ఆవేదన చెందుతున్నారని అన్నారు. ప్రభుత్వం పంట నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అధికారులు పంటనష్టంపై నివేదిక ఇవ్వాలని, సాధ్యమైనంత త్వరగా కాంటాలు పూర్తిచే యాలని సూచించారు. తూకంవేసిన వడ్లు సాధ్యమైనంత తొందరగా రైస్‌మిల్లులకు తరలించాలని, తడిసిన ధాన్యాన్ని రైస్‌మిల్లర్లు దించుకోవాలని కోరారు. అనంతరం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని సిరిసిల్లరోడ్డులో గల కన్యక పరమేశ్వరి ఉత్సవాలను ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వీక్లిమార్కెట్ నుంచి చేపట్టిన యాత్రలో ఎమ్మెల్యే వెంకటరమణరెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి నరేందర్‌రెడ్డి, శ్రీకాంత్, భూమేష్ పాల్గొన్నారు.

### తడిసిన ధాన్యాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే

**రాజంపేట :** మండలంలోని తలమడ్ల గ్రామంలో మంగళవారం రాత్రి కురిసిన వడగళ్ల వానకి తడిసిన ధాన్యాన్ని బుధవారం కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హమాలీలు లేకపోవడంతో కొనుగోలు చేయడంలో జాప్యం జరిగిందని, సరైన సమయంలో కొనుగోలు చేపట్టి ఉంటే రైతులకు నష్టం జరిగి ఉండేది కాదన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందర్ రెడ్డి, మండల అధ్యక్షుడు సంపత్‌రెడ్డి, నాయకులు గంగారెడ్డి, బాలు, యశ్వం త్ పాల్గొన్నారు.

**మహమ్మద్‌నగర్ :** మహమ్మద్ నగర్ మండలంలోని హసన్‌పల్లి, నర్వ తదితర గ్రామాలలో మంగళవారం అర్ధరాత్రి కురిసిన అకాలవర్షానికి ధాన్యం తడిసిపోయింది. హసన్‌పల్లిలో గ్రామ రైతు కుమ్మరి యాదయ్య తన వరిధాన్యం పూర్తిగా తడిసిపోవడంతో కన్నీటి పర్యాంతమ య్యాడు. 20 రోజులైన కొనుగోలు కేంద్రాల్లో హమాలీ లేక, లారీలు లేక అధికారులు పట్టిం చుకోక పోవడంతో అకాల వర్షానికి ధాన్యం తడిసిపోయి తీవ్రంగా నష్టపో యినట్లు తెలి పారు. నర్వ గ్రామంలో వరి ధాన్యకుప్పలను తహసీల్దార్ సవాయిసింగ్ పరిశీలించారు. రైతులు ఆందోళన చెందవద్దని ప్రతిగింజను ప్రభుత్వం కొనుగోలుచేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో రైతులు రాజేందర్, కాశీనాథ్, శ్రీనివాస్, రాములు, పరమేష్ పాల్గొన్నారు.

# వీరజవాన్ మృతికి సంతాపం


జెండాను ప్రదర్శిస్తున్న విశ్వహిందూపరిషత్ నాయకులు

మద్నూర్, మే 7 (ఆంధ్రజ్యోతి) : మద్నూర్ మండల కేంద్రానికి సరిహద్దులో మహారాష్ట్ర, దేగ్లూర్ నగరానికి చెందిన వీర జవాన్ సచిన్ యాదవ్ వనంజే జమ్ముకాశ్మీర్‌లో వీరమరణం పొందారు. ఆయన పవిత్రఆత్మకు శాంతి కలగాలని మద్నూర్ మండల కేంద్రంలో నివాళులు అర్పించారు. ఐదు సంవత్సరాలుగా జమ్మూ కాశ్మీర్‌లో విధులు నిర్వహిస్తున్నారని, ఇటీవల జమ్మూ కాశ్మీర్ యుద్ధ టాంక్ నడిపే సమయంలో బోల్తాపడి మృతిచెందినట్లు స్థానికులు తెలిపారు. మృతు నికి ఆరునెలల పాప ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. దెగ్లూర్ పట్టణంలో గురువారం ఆయన అంత్యక్రియలు ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించటానికి అధికారులు మున్సిపాలిటీ ఏరియాలోఏర్పాట్లు చేస్తున్నారు.

**కామారెడ్డిటౌన్ :** ఉగ్రవాదుల శిబిరాలపై కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో వైమానిక దళాలు దాడులు చేయడంపై హర్షం వ్యక్తం చేస్తు విశ్వహిందూపరిషత్ నాయకులు సంబరాలు జరిపారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని నిజాంసాగర్ చౌరస్తాలో టపాకాయలు కాల్చి జాతీయజెండాను ప్రదర్శిస్తూ ఆనందం వ్యక్తం చేశారు. అమాయక ప్రజలను పొట్టనపెట్టుకుంటున్న ఉగ్రవాదులకు, వారికి ఆశ్రయం కల్పి స్తున్న పాకిస్తాన్‌కు గట్టిబుద్ధి చెప్పాల్సిన అవసరం ఎంతైన ఉందని అన్నారు. కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు నిత్యనందం, నగర అధ్యక్షుడు వెంకటస్వామి, నగరకార్యదర్శి వంగప్రసాద్, బజరం గ్‌దళ్ జిల్లా సంయోజక్ అశోక్, అనిల్, మంచాలరాజు, భరత్, రామ్, రాజేష్, శివ తదితరులు పాల్గొన్నారు.

## 'గ్రామాల అభివృద్దే లక్ష్యం'


క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

బీబీపేట, మే 7(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్దే ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ లక్ష్యమని బీబీపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సుతారి రమేష్ అన్నారు. బుధవారం మందాపూర్ గ్రామంలో ఎన్‌ఆర్‌ఈ జీఎస్ నిధుల ద్వారా విడుదలైన రూ.15లక్షల వ్యయంతో సీసీరోడ్డు నిర్మాణపనులు చేపట్టారు. కార్యక్రమంలో భిక్కనూరు ఏఎంసీ చైర్మన్ పాతరాజు, జిల్లా నాయకులు భూమా గౌడ్, మందాపూర్‌గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చింతకుంట రాకేష్‌రెడ్డి, రాజు, శ్రీనివాస్‌గౌడ, రాజారెడ్డి, ప్రభాకర్, శ్రీకాంత్ రెడ్డి, బాబు పాల్గొన్నారు. మండల కేంద్రంలోని ప్రధాన కూడలి వద్ద బుధవారం ప్రాణహిత చేవెళ్ల పునర్నిర్మాణానికి ప్రభుత్వం నుంచి రూ.23 కోట్లు మంజూరు చేసినందుకు సీఎంరేవం త్‌రెడ్డి, నీటి పారుదల శాఖమంత్రి ఉత్తమ్‌కు మార్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ చిత్రపటాలకు కాంగ్రెస్ నాయకులు పాలాభి షేకం చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సుతారిరమేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ పాతరాజు, జిల్లా నాయకులు భూమా గౌడ్, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు మహేష్ కుమార్ పాల్గొన్నారు.

**మాచారెడ్డి :** ప్రాణహిత-చేవేళ్ల పథకానికి రూ.23.15కోట్లను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేయడం పట్ల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నౌసిలాల్ నాయక్ హర్షం వ్యక్తం చేశారు. బుధవారం మాచారెడ్డి మండలకేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు షబ్బీర్‌అలీ, రాహుల్‌గాంధీ, సీఎం చిత్రపటానికి పాలాభిషేకం కార్యక్రమాన్ని నిర్వహించారు.

# వాసవిమాతకు పూజలు


ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు

బాన్సువాడటౌన్ , మే 7(ఆంధ్రజ్యోతి) ఆర్యవైశ్యుల ఆరాధ్యదైవం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి మాత జన్మదినాన్ని పురస్కరించుకొని బుధవారం బాన్సువాడ పట్టణంలోని ఆర్యవైశ్య సంఘ భవనంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు , అలంకరణ చేపట్టారు. మహిళలు సామూహిక కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రజాప్రతినిధులు , నాయకులు , భక్తులు తదితరులున్నారు.

**తాడ్వాయి :** మండలంలోని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవి మాత జన్మదినాన్ని పురస్కరిం చుకొని కలష పూజలను నిర్వహించారు. మండ లంలోని ఆర్యవైశ్యులు కలిశాలను వీధుల గుండా ఊరేగించి భక్తిశ్రద్ధలతో శబరిమాత ఆశ్రమంలో కుంకుమ పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మండల అధ్యక్షుడు గంగాచరన్, తాడ్వా యి గ్రామ అధ్యక్షులు కిషోర్, ఆర్యవైశ్య మండల గ్రామ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

**నాగిరెడ్డిపేట :** ఆర్యవైశ్యుల కులదైవమైన శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి మాత జన్మదినాన్ని పురస్కరించుకొని వేడుకలను బుధవారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని గోపాల్‌పేట్ ఆర్యవైశ్య సంఘం కల్యాణ మండపంలో కన్యకా పరమేశ్వరి మాత జయంతి వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు సతీష్, ప్రధాన కార్యదర్శి డిగంబర్, ఆర్యవైశ్య సంఘం నాయకులు మాణిక్యం, అవినాష్ పాల్గొన్నారు.

**లింగంపేట :** ఆర్యవైశ్యుల ఆరాధ్యదైవం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి మాతా జన్మదినాన్ని పురస్కరించుకొని బుధవారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు , అలంకరణ చేపట్టారు. మహిళలు సామూహిక కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మండల కేంద్రంలోని బోనాలతో ప్రధాన వీధు ల్లో మహిళలు, పురుషులు భారీర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కౌడ శ్రీను, పవన్, రవి, దుర్గయ్య, కృష్ణమూర్తి ఉన్నారు.

**బీర్కూర్ :** ఆర్యవైశ్య కుల దైవం వాసవి కన్యాకాపరమేశ్వరి మాత జన్మదినాన్ని పురస్కరించుకొని వేడుకలను బుధవారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో బీర్కూర్ మండలకేంద్రంలో నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు కర్నాకంటి ప్రవీణ్ గుప్తా, కార్యదర్శి రంజిత్, కోశాధికారి ప్రవీణ్, సభ్యులు కందుకుర్తి సంతోష్, సాయినాథ్, నాగరాజు, నర్సింలు, మహాజన్ సంతోష్, గోపీనాథ్, రేణికుంటి రమేష్, దారం గంగాదర్, వీరేశం, రాకేష్, సంగమేశ్వర్ సభ్యులు పాల్గొన్నారు.

## వక్ఫ్ బిల్లును రద్దు చేయాలని ఆందోళన



సదస్సులో నిరసన తెలుపుతున్న మైనార్టీలు

బాన్సువాడ, మే 7 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తెచ్చిన వక్ఫ్ బిల్లును రద్దు చేసే వరకు దేశ వ్యాప్తంగా శాంతియుతంగా ఆందోళనలు చేస్తామని ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్‌లా బోర్డు మహిళా కన్వీనర్ జలీసా సుల్తానా పేర్కొన్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన కొత్త ఎండోమెంట్ చట్టంపై బాన్సువాడ డివిజన్ కేంద్రంలోని మీనా గార్డెన్‌లో బుధవారం ముస్లిం మహిళల మహాసభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సుల్తానా హాజరయ్యారు. సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజ్యాంగ పరిరక్షణ ప్రచారంలో భాగంగా జిల్లాలు, నగరాలలో మహిళలు, పురుషులకు సంబంధించిన నిరసన కార్యక్రమాల పరంపర కొనసాగుతోందని అన్నారు. వక్ఫ్ సవరణలు మత, సాంస్కృతిక, మత సామరస్యం, రాజ్యాంగ నిర్మాణంపై ప్రత్యక్ష దాడి అని పేర్కొన్నారు. ఈ సవరణలు ఇస్లామిక్ బోధనలు, మతపరమైన స్వేచ్ఛలు, మన రాజ్యాంగంలో పొందుపరచబడిన ప్రాథమిక విలువలను ఉల్లంఘించాయన్నారు. వివిధ మత, కమ్యూనిటీ - ఆధారిత, సామాజిక సమూహాల సహకారంతో దేశవ్యాప్త ఉద్యమానికి ప్రణాళికలు చేసినట్లు తెలిపారు. సేవ్ వక్ఫ్ సేవ్ ది కాన్సిట్యూషన్ పేరిట ఈ ఆందోళనలు జరుగుతాయని అన్నారు. కార్యక్రమానికి హాజరైన ప్రత్యేక అతిథుల్లో ముస్లిం పర్సనల్ లా , ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు హ ఫీజ్ ఫహిముద్దీన్ మునిరి, లా బోర్డు సభ్యులు డాక్టర్ ఖుద్దూస్, నసీరా ఖానుమ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు అలీబిన్ అబ్దుల్లా, మహమ్మద్ ఎజాస్, హఫెజ్ వహాబ్,అబ్దుల్ ఖలేక్, అలీముద్దీన్ బాబా, జామా మసీదు అధ్యక్షుడు ఇంతియాజ్ తన్ను, ముఫ్తీ ఒమర్ బిన్ ఇసా, ఇర్ఫాన్ ఖస్మి, షాహబ్, ఆతిఫ్ తదితరులు పాల్గొన్నారు.

## 'విద్యుత్ ప్రమాదాల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి'

ఎల్లారెడ్డి, మే 7 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ప్రమాదాల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని విద్యుత్ క్వాలిటీ కంట్రోల్ ఎస్సీ బి. శ్రీనివాస్ అన్నారు. బుధవారం ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని వీకేవి ఫంక్షన్ హాల్ లో విద్యుత్ భద్రత వారోత్సవాల ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ సిబ్బంది ఎర్త్ రాడ్లు, హ్యాండ్ బ్లౌజులు ఉపయోగించి విద్యుత్ ప్రమాదాలను నివారించాలని సిబ్బందికి విద్యుత్ ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు అదేవిధంగా రైతులకు నాణ్యమైన సర్వీస్ వైర్ ప్లాస్టిక్ స్టార్టర్ డబ్బాలు ఉపయోగించేలా అవగాహన కల్పించాలని ఏదైనా విద్యుత్ సమస్య ఎదురైనప్పుడు రైతులు విద్యుత్ సిబ్బందిని సంప్రదించాలని రైతులు స్టార్టర్ డబ్బాల వద్ద సొంతగా రిపేర్లు చేసుకుని విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా విద్యుత్ సిబ్బంది తప్ప ఇతరులకు ఎల్సీలు ఇవ్వకూడదని సూచించారు, ఈ కార్యక్రమానికి స్థానిక వైద్యులు హాజరై విద్యుత్ షాక్ తగిలినట్లయితే ప్రాథమిక చికిత్స సిపిఆర్ ఎలా చేయాలో విద్యుత్ సిబ్బందికి అవగాహన కల్పించారు కార్యక్రమంలో ఎస్సీ సూపరిండెంట్ ఇంజనీర్ శ్రావణ్ కుమార్, డిఇ విజయ సారథి, ఏడీలు ఏఈలు సబ్ ఇంజనీర్లు, లైన్మెన్లు సబ్ స్టేషన్ ఆపరేటర్లు పాల్గొన్నారు.


పోస్టర్ల ఆవిష్కరణలో విద్యుత్ సిబ్బంది

## వివిధ విభాగాల్లో శిక్షణా తరగతులు

బీబీపేట, మే 7(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత(బాలుర) పాఠశాలలో బుధవారం విద్యాశాఖాధికారి అశోక్ వేసవి శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు శిబిరాన్ని నిర్వహించనున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవీందర్‌రెడ్డి తెలిపారు. శిబిరంలో ఇండోర్‌గేమ్, చెస్, క్యారమ్స్, చిత్రలేఖనంతో పాటు కంప్యూటర్స్‌లో పెయింట్ నేర్పించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో 6 నుంచి 9వతరగతి వరకు చదువుతున్న విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అరుంధతి, సంధ్య, రాజేష్, విశ్వమోహన్ పాల్గొన్నారు.

## జాతీయ మానవహక్కుల కమిటీ ఎన్నిక

గాంధారి,మే 7(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో బుధవారం జాతీయ మానవహక్కుల కమిటీని ఎన్నుకున్నారు. మండల చైర్మన్‌గా నితిన్‌కుమార్‌ను నియమించారు. మానవహక్కుల జాతీయ కమిటీ చైర్మన్ మహమ్మద్ యాసిన్ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నితిన్‌కుమార్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి మండల చైర్మన్‌గా ఎన్నుకున్నందుకు పదవికి న్యాయం చేస్తానని తెలిపారు.

## ఆలయానికి భక్తుల విరాళాల అందజేత

మాచారెడ్డి, మే 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చుక్కాపూర్ లక్ష్మీ నర్సింహాస్వామి ఆలయానికి భక్తులు విరాళాలు అందజేశామని ఆలయ చైర్మన్ శనిగరం కమలాకర్‌రెడ్డి బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధి కోసం ముంబైకి చెందిన శ్రీ నరేంద్ర మాలినీ కుటుంబసభ్యులు రూ.11,100లను విరాళంగా అందజేశామన్నారు. ఈ మేరకు దాతను ఆలయ కమిటీ తరుపున సన్మానించారు. కార్యక్రమంలో డైరె క్టర్ పాత లక్ష్మీరాజం, ఆలయ ఈవో శ్రీధర్ పాల్గొన్నారు.

## సమైక్య కార్యాలయంలో ఆడిట్

రాజంపేట, మే 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఐకేపీ కార్యాలయంలో బుధవారం 2024-25 సంవత్సరానికి సంబంధించిన ఆడిట్‌ను నిర్వహించినట్లు ఏపీఎం సాయిలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చార్టర్ అకౌంటెంట్ ఇప్పకాయల రమేష్ అసోసియేట్స్ కంపెనీ ఆధ్వర్యంలో గ్రామసంఘాల మండల సమాఖ్యలోని 22 గ్రామ సంఘాల పుస్తకాలు ఆడిట్ పూర్తి చేశామన్నారు. ఆడిట్‌పై ఆడిటర్లు సంతృప్తి వ్యక్తం చేశారని తెలిపారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల అధ్యక్షులు, సీసీలు, వీవోఏలు, అకౌంటెంట్లు పాల్గొన్నారు.

## హెడ్‌కానిస్టేబుల్‌పై సస్పెన్షన్ వేటు

కామారెడ్డిటౌన్,మే 7(ఆంధ్రజ్యోతి): పాస్‌పోర్టు విచారణలో తీవ్ర నిర్లక్ష్యం వహించినందుకు గాను హెడ్‌కానిస్టేబుల్ కృష్ణను డీఐజీ శ్రీసన్ ప్రీత్ సింగ్ సస్పెండ్ చేశారు. గత ఏడాది జిల్లా డిస్ట్రిక్ స్పెషల్ బ్రాంచ్‌లో విధులు నిర్వహిస్తున్న సమయంలో టేకుల రాజయ్య పాస్‌పోర్టు దర ఖాస్తుపై విచారణ చేయు విషయంలో కృష్ణ తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవ హరించారని తెలిపారు. కనీస ప్రాథమిక పరిశీలన లేకుండానే క్లియరెన్స్ ఇచ్చారని తెలిపారు. సమగ్ర విచారణ చేయకపోవడంతో రాజయ్యకు అంతకు ముందే రాజు పేరుపై ఉన్న పాస్‌పోర్టు గురించి తెలుసుకో లేక పోయారు. ఆ తర్వాత రాజయ్యపై ఆర్‌జీఐ ఎయిర్‌పోర్టు పోలీసుస్టేషన్ లో కేసు నమోదుచేశామని తెలిపారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించి నందుకు గాను కృష్ణను సస్పెండ్ చేసినట్లు తెలిపారు. విధుల్లో నిర్లక్ష్యంగా ప్రదర్శించిన వారిపై కఠినచర్యలు తీసుకుంటామని, నమ్మకాన్ని నిలబెట్టే దిశగా పోలీసుశాఖ సమర్థంగా పనిచేస్తుందని, బాధ్యత లేకుండా ప్రవర్తిం చే పోలీసు అధికారులు, సిబ్బందిపై నిఘా ఉంటుందని తెలిపారు.

## భూముల సర్వే వద్దని గ్రామస్థుల ఫిర్యాదు


సర్వే టీంను అడ్డుకుంటున్న గ్రామస్తులు

లింగంపేట, మే 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మెంగారం గ్రామ శివారులోని సర్వే నంబర్ 272లోని రెవెన్యూ భూమిలో అక్రమంగా భూభారతిలో పట్టాల కోసం దరఖాస్తులు చేసుకున్నారని వాటిని సర్వే చేయవద్దని గ్రామస్తులు అడ్డుకోవడంతో పాటు సర్వే అధికారులకు ఫిర్యాదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి.. భూ భారతి పైలెట్ మండలమైన లింగంపేట మండలంలోని మెంగారంలో లింగంపేట, ఐలాపూర్, కామారెడ్డి ప్రాంతాలకు చెందిన కొందరు భూ కబ్జాదారులు అక్రమంగా పట్టాలు పొందేందుకు భూ భారతిలో దరఖాస్తులు చేసుకున్నారని వాటిని సర్వే చేయవద్దని వారు సర్వే టీంకు పిర్యాదు చేశారు. పిర్యాదు చేసిన వారిలో దాసరి సాయిలు, అన్నం సాయిలు, కొమ్ముల రమేష్, బాలాగౌడ్, బాలసాయిలు, యాదగిరి, బాబు, బాలయ్య గ్రామస్తులు ఉన్నారు.

## బాణాపూర్ సబ్‌స్టేషన్‌లో పీటీఆర్‌ను ప్రారంభించిన ఎస్‌ఈ

లింగంపేట, మే 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బాణాపూర్ సబ్‌స్టేషన్‌లో బుధవారం రూ. కోటి విలువ చేసే పీటీఆర్‌ను కామారెడ్డి జిల్లా ఎస్‌ఈ శ్రావణ్‌కుమార్ ప్రారంభించారు. సబ్‌స్టేషన్‌లో 3.15ఎమ్‌వీఏ పీటీఆర్ స్థానంలో 5ఎమ్‌వీఏ పీటీఆర్‌ను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. దీంతో గ్రామంలో విద్యుత్ సమస్యలు రావని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డీఈ విజయసారథి, ఏడీఈ మల్లేష్, ఏఈ అశోక్, ఎల్‌ఐ కిష్టయ్య, మాజీ సర్పంచ్ నర్సింలుతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

## విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి

లింగంపేట, మే 7 (ఆంధ్రజ్యోతి) : మడలంలోని పొల్కంపేటకు చెందిన మహేష్‌గౌడ్‌కు చెందిన పాడి గెదె బుధవారం విద్యుదాఘాతంతో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. ప్రతీ రోజులాగే గేదె మేతకు వెళ్లిందని గ్రామ సమీపంలోని వ్యవసాయ క్షేత్రంలో మేత మేస్తుండగా అక్కడ విద్యుత్ స్థంబానికి ఉన్న సపోర్టింగ్ తీగకు విద్యుత్ ప్రవాహం జరగడంతో సపోర్టింగ్ తీగకు తగిలి గేదె మృతి చెందినట్లు వారు తెలిపారు. గెదె నిండు చూలుగా ఉందని దాని విలువ రూ.70వేల వరకు ఉంటుందని వారు తెలిపారు. విద్యుత్ అధికారులు పాడి రైతును ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

## నేడు ఎల్లారెడ్డిలో ఎమ్మెల్యే పర్యటన

ఎల్లారెడ్డి, మే 7 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిలో ఎమ్మెల్యే మదన్ మోహ న్ రావు పర్యటన ఉంటుందని బుధవారం క్యాంపు కార్యాలయం సిబ్బంది ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం ఎల్లారెడ్డి పట్టణంలో దేవి హాస్పిటల్ ప్రారంభోత్సవం అనంతరం, ఎల్లారెడ్డి పట్టణంలో లక్ష్మాపూర్, సోమార్‌పేట్ గ్రామాలలో పర్యటన ఉంటుందన్నారు.

## సినిమా గైడ్ కామారెడ్డి



**కామారెడ్డి**

దర్శన్ - తుడరాం
ప్రియా 70 - రెట్రో
ప్రియా 35 - రైడ్-2

**బాన్సువాడ**

మహేశ్వరి - అర్జున్ సన్ ఆఫ్ వైజయంతి
వెంకటేశ్వర - సోదర

## చికెన్ ధరలు



| రకం | : | లైవ్ | విత్‌స్కిన్ | స్కిన్‌లెస్ |
|---|---|---|---|---|
| సుగుణ (కిలో) | : | 120 | 140 | 170 |
| వెన్‌కాబ్(కిలో) | : | 130 | 160 | 190 |

